ప్రజాశక్తి

Vol. 3, no. 26

(Dec. 29, 1943)

బెజవాడ, 1943

Record no. 683

Prajāśakti

Vol. 3, no. 26

(Dec. 29, 1943)

Bejavāḍa, 1943

Record no. 683

0-2-0 Regd. No M. 4486

ప్రజాశక్తి

భారత కమ్యూనిస్టుపార్టీ, ఆంధ్రకమిటీ పత్రిక

సంపుటి 3 | సంచిక 26

: సంపాదకవర్గం :
మద్దుకూరి చంద్రశేఖరరావు (సం)
కంభంపాటి సత్యనారాయణ
పుచ్చలపల్లి సుందరయ్య
తుమ్మల వెంకటరామయ్య
చలసాని వాసుదేవరావు

బుధవారం 29-12-43

రైతువుద్యమంలో రంగాముఠాతెచ్చే చీలికలు

ఆనాడు రైతుసంఘాలను రద్దుచేయడం - ఈనాడు పోటీ సంఘాలను పెట్టడం - రెండూ రైతు వుద్యమాన్ని దెబ్బకొట్టేవే

★

నందూరి ప్రసాదరావు
ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ
ప్రధాన కార్యదర్శి

(1942 ఆగస్టులో దేశంలో బహు విషమ పరిస్థితు లేర్పడ్డాయి. ఆ సమయంలో రంగాముఠావారు రైతుసంఘాలను విడిచిపెట్టి పోయారు. తిరిగి ఈనాడు ఉన్న రైతుసంఘాలకు పోటీగా, సంఘాలను పెట్టాలని రంగాముఠా నాయుడుపేట సభలో తీర్మానించింది. రంగాముఠాయొక్క ఈ అవకాశవాదాన్ని గుర్తించక, కొందరు కాంగ్రెసు దేశభక్తులు వారి ఎత్తులకు సహాయం జేస్తున్నారు. కృష్ణాజిల్లా ఇందుకు నిదర్శనం. రంగాముఠా ఈ చర్యలవల్ల బలహీనపడేది రైతు వుద్యమం. ఈ అపాయాన్ని గురించి ప్రజలనూ, దేశభక్తులనూ హెచ్చరించుటకే ఈ వ్యాసం ఉద్దేశింపబడింది)

ఈనాడు భారతదేశపు రైతులకు రాజకీయంగాను, ఆర్థికంగాను అనేక కష్టాలు వున్నాయి. వీటిని తొలగించుకొనుటకై, రైతులు సంఘాల నేర్పర్చుకొని కృషిజేస్తూ వున్నారు. ఆంధ్రదేశంలో ఇట్టి సంఘాలు సుమారు 20 సంవత్సరాలక్రిందనే ఏర్పడి, కొద్దికొద్దిగా పనిజేయ ప్రారంభించాయి. ప్రథమంలో అనేకమంది స్వార్థపరులూ, అవకాశవాదులు(Opportu nists) వీటిల్లో దూరినా, రైతులు చైతన్యంపొందుతూ, ఉద్యమం అంతకంతకూ తీవ్రగతినిపొందుతూ వున్నప్పుడు వీరు ఈ సంఘాలలోనుండి మెల్లిగా జారిపోతూవచ్చారు. అందువల్ల ఉద్యమం నాశనముకాలేదు.

రంగాముఠా అస్త్రసన్యాసం

ఆచార్యరంగా, వారిఅనుచరబృందం రైతుసంఘాలలో ఒకముఠాగా పనిజేస్తూ వచ్చారు. వారిరాజకీయాలకై రైతుసంఘాన్ని ఉపయోగించుకొనుటకు తంటాలుపడుతూ వచ్చారు. సభ్యులులేనివీ, సంఘాలుకూడాలేనివీ,అయిన దక్షిణభారత కార్మిక, కర్షక సమ్మేళనం, జమీన్‌రైతుసంఘం, రైతు రక్షణసంఘం, మొదలయిన నామమాత్ర సంఘాలుపెట్టి వ్యవహరించసాగారు. 1940 లో రాష్ట్ర రైతుసంఘ వర్కింగుకమిటీని స్వాధీనపర్చుకున్న మీదట, సంఘం తమ చేతుల్లోనుండి జారిపోనీయకుండా అనేక అక్రమచర్యలు అవలంబించారు. సర్వాధికారాలనూ వర్కింగుకమిటీకి పుచ్చుకున్నారు. అనేక జిల్లారైతుసంఘాలకు సభ్యులను జేర్చుటకు రశీదులివ్వలేదు. వారు జేర్పించి పంపించిన సభ్యత్వాన్ని అంగీకరించలేదు. తాము కూడా పాల్గొన్న అఖిలభారత రైతుసంఘ కార్యనిర్వాహకవర్గంలో ఏకగ్రీవంగా ప్యాసయిన తీర్మానాలకు విరుద్ధంగా పనిజేయసాగారు.

ఇటువంటి సమయంలోనే, 1942 ఆగస్టు సంఘటనలు ప్రారంభమైనాయి. ప్రభుత్వ నిర్బంధవిధానంవల్లనూ, ప్రజల ఉద్రేకంవల్లనూ దేశం దగ్ధమైపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇటువంటి పరిస్థితులు కొనసాగడము, జపాను మనదేశంమీదికి దూకటానికి అనుకూలం. ఇటువంటి సమయంలో రైతుసంఘాలు ఏమి చెయ్యాలి? రైతుసంఘ నాయకుల కర్తవ్యం ఏమిటి?

ఇటువంటి పరిస్థితులలోనే రైతుసంఘాల అవుసరం మరీ ఎక్కువ: ప్రజలకు దోవ చూపాలి. ప్రభుత్వ నిర్బంధవిధానాన్ని ఎదుర్కోవాలి. తమకూ, దేశానికీకూడా ముప్పు తెచ్చేవి, జపానుకు అనుకూలపడేవి అయిన చర్యలనుండి ప్రజలను మరల్చాలి. గాంధిజీ మున్నగు కాంగ్రెసునాయకుల విడుదలకై అందోళన చేయాలి. సాముదాయిక జరిమానాలను రద్దుచేయించుటకై అందోళనచేయాలి. వీటితోబాటు, కిరోసిన్, అగ్గిపెట్టెలు, ధాన్యం మున్నగువాటిల్లో ప్రజలకు నిత్యం సంభవించే ఇబ్బందులను తొలగించుటకై పనిజేయాలి. ఈ విధంగా పనిజేయమనే అఖిలభారత రైతుసంఘం, రైతుసంఘాలకన్నింటికీమార్గం చూపించింది.

రంగాముఠా ఈపనులను వేటినీ చేయలేదు. రైతులను దారుణ నిర్బంధవిధానాన్నుండి మరల్చుటకూ, అరాజకచర్యలనుండి మరల్చుటకూ, ఏమీచేయలేదు. పై పెచ్చు వీరిలో కొంతమంది అరాజకచర్యలను ప్రోత్సహించారు. పోస్టాఫీసులను తగులబెట్టించటం,దోపిడీలు చేయించటం మున్నగు ఘాతుకచర్యలనుసాగించారు. ఉత్తరవిశాఖ,గుంటూరు, కడప, కర్నూలు జిల్లాలలో ఇటువంటి చర్యలెన్నియో జరుపబడ్డాయి. ఇందువల్ల ప్రభుత్వం తీవ్ర నిర్బంధవిధానం సాగించటం, ప్రజలు యమయాతనలకు గురికావటం జరిగింది. ఈవిధంగా అతి క్లిష్టదశలో రైతులను పెనురొంపిలో దింపి, రైతుసంఘాలను రద్దుచేశామంటూ రైతులకే తీరని ద్రోహం చేశారు.

కొంతమంది ఈవిధంగా భావించవచ్చు. "ఇప్పుడు నిర్బంధవిధానం జోరుగా వుంది. రైతుసంఘాలు పనిచేయడానికి వీలులేదు. అందుచే రద్దుచేశారు." కాని రణరంగంలో నిలిచి పోరాడు సైనికుడుచేసే వాదనాయిది? ప్రాణాలనుసైతం ఒడ్డి ప్రజాసేవజేసే దేశభక్తుడి అలోచనా యిది? ఎన్నటికికాదు. ఇది అస్త్రసన్యాసం; కర్తవ్యాన్ని నెరవేర్చలేక చతికిల బడటం.

నిజమైన రైతుశ్రేయోభిలాషి, ప్రజానాయకుడు ఎన్నడూ ఇట్లు రైతులను అవసర సమయంలో వదిలిపెట్టడు. చావో, బ్రతుకో, రైతులప్రక్కనే నిలబడాలి. వారికి కలుగు కష్టాలను తొలగించుటకు కృషిజేయాలి. అందులకై రైతుసంఘాలను బలపర్చాలి. ఉద్యమాన్ని తీవ్రంగా సాగించాలి. ప్రపంచంలోజరిగిన అనేక విప్లవోద్యమచరిత్రలు చదివితే, యిట్టి ఘట్టాలు మనకు అనేకం కన్పిస్తాయి. ఇటువంటి క్లిష్టసమయాల్లోనే ఎన్ని నిషేధాలున్నా, వేలకొలది దేశభక్తులు పనిజేస్తూ వురిస్తంభాలకెక్కటం కూడా చూస్తూనే వున్నాము. కాని ఎక్కడా సంఘాలను రద్దు చేయటం చూడలేదు. ఈనాడు రంగాముఠా రైతుసంఘాలను రద్దుచేయటంమాత్రం చరిత్రలో నభూతోనభవిష్యతి! ప్రతి ప్రజాసేవకుడూ గ్రహించవలసిన సందర్భం యిది.

రైతుసంఘ పురోగమనాన్ని ఎవ్వరూ ఆటంకపర్చలేరు

దేశంలో ఏర్పడ్డ ఈవిపరీత పరిస్థితులలో రైతులనురక్షించడానికై, అఖిలభారత రైతుసంఘం యిచ్చిన సూచనలప్రకారం, రైతుసంఘాలన్నీ తీవ్రంగా కృషిచేస్తూవున్న సమయంలో, రంగాముఠా ఈ వెన్నుపోటు పొడిచింది. ఇందువల్ల రైతుఉద్యమం తాత్కాలికంగా కొంతదెబ్బతిన్నది. రైతులు అయోమయంలో పడ్డారు. రైతుసంఘంతాత్కాలికంగాబలహీనపడ్డది. అయినా అంతటితో రైతుసంఘాలు అంతంకాలేదు. ఒక విప్లవప్రజావుద్యమంయొక్క జీవితం, ఏకొద్దిమంది అవకాశవాదుల కుప్పిగంతులమీదనో ఆధారపడి వుండదు. అనేకతరహాల మనుష్యులు ఉద్యమంలోకివస్తూవుంటారు. కాలక్రమాన, ఉద్యమవేగానికి, వారిలో కొంతమంది వెనుకబడి జారిపోతూవుంటారు. కాని ఈవిధంగాకొద్దిమంది జారిపోతూవుంటే, వేలు, లక్షలకొలది సామాన్యప్రజలు వుద్యమంలో జేరి విప్లవపూరితం చేస్తారు. ఈవిధంగానే, మొదట్లో కొలదిమంది మేధావులతో కూడుకొన్న కాంగ్రెసు, బ్రహ్మాండమైన ప్రజాసంస్థగా అభివృద్ధి జెందింది. అదేవిధంగా ఆంధ్రరాష్ట్ర రైతుసంఘంనుండి రంగాముఠా తప్పుకున్నంతమాత్రాన ఉద్యమం వెనుకబడలేదు.

రంగాముఠా రైతుసంఘాలను విడనాడగానే అఖిలభారత రైతుసంఘం, లోగడ 3 సంవత్సరాలపాటు ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ ప్రధాన కార్యదర్శిగా పనిజేసిన శ్రీ చలసాని వాసుదేవరావుగార్ని రాష్ట్ర ఆర్గనైజరుగా నియమించింది. వాసుదేవరావుగారు అప్పటి జిల్లా రైతుసంఘ అధ్యక్షులను లేక కార్యదర్శులను జిల్లా ఆర్గనైజర్లుగా నియమించి పనిజేయసాగారు. రంగాముఠా విడనాడినా, రైతులు రైతుసంఘాలను విడనాడలేదు. ఒక్కనెలలో 55,561 మంది సభ్యులుగా జేరారు. 1943 మార్చిలో 9 జిల్లారైతుసంఘాలకూ, రాష్ట్రరైతుసంఘానికీ ఎన్నికలు జరిగి, కార్యనిర్వాహకవర్గములు ఎన్నుకోబడ్డాయి. నేడు రాష్ట్ర సంఘం 95,000 పైగా సభ్యత్వాన్ని కల్గివుంది. (సభ్యత్వాన్ని జేర్చడం ఇంకా పూర్తికాలేదు) తమకాలం యావత్తు రైతుసంఘ సేవకు వినియోగించే 175 గురు వర్కర్లు వున్నారు. వీరుగాక,2100 గ్రామాలలో స్థానికంగా రైతుల దైనందినసమస్యలలో పనిచేసే 2000 కు పైగావర్కర్లున్నారు. 196 మంది వర్కర్లు రైతాంగ పాఠశాలలో తర్ఫీదై, సంఘాన్ని చక్కగా నిర్మిస్తున్నారు. ఏనాడు ఇంత పగడ్బందీగా రైతుసంఘాలు నడుపబడ్డాయి?

ఈ నిర్మాణాభివృద్ధితోబాటు ఉద్యమంకూడా ఎంతో ముందుకు పోయింది. అరాజకచర్యలు దేశస్వాతంత్ర్య మార్గం కాదనీ, శత్రువుకు మాత్రమే ఉపకరించేవని రైతులు గుర్తించునట్లు చేయబడింది. సాముదాయక జరిమానాలు రద్దుకాబడుటకు విశేష కృషి జరిగింది. కిరోసిన్, అగ్గిపెట్టెలు, పంచదార వగైరా వస్తువులు దొంగమార్కెటుకు పోకుండా కంట్రోలు ధరల కమ్మబడుటకు తీవ్రకృషి జరిగింది. రాయలసీమ కరువుపై ఆంధ్ర ప్రజానీకం దృష్టిని, శక్తిని మళ్ళించునట్లు చేసింది. వాలంటీర్లను పంపి కరువు క్యాంపులలో కూలీలకు జరిగే అన్యాయాలను ఎదుర్కొని, అచ్చటి ప్రజల మన్ననల పొందింది. కానూరు, పెండ్యాల మున్నగు ఇర్రిగేషన్ స్కీములను సాధించింది. బుడమేరు స్కీము పని తిరిగి ప్రారంభించునట్లు అందోళనచేసింది అనేక వేల ఎకరాలలో ఎండిపోతున్న పైర్లకు నీరు ఇప్పించగల్గింది. వేలకొలది రూపాయాల పెనాల్టీలనురద్దుచేయించింది. జమీందారీ చెర్వుల మరమ్మతుకై అందోళన చేసి, అక్టును సాధించింది. జమీందారీ బంజర్ల సాగుకై సూచనలిచ్చి, ప్రభుత్వంచే అంగీకరింప జేసింది. అనేక చోట్ల రైతుకూలీ సామరస్యమును ఆచరణలో సాధించింది. యుద్ధబాండుల విషయంలో అధికారులు నిర్బంధాల నెదుర్కొంటూ, రైతులు యిష్టపూర్వకంగా, శక్తికొలది యిచ్చునట్లు చేస్తోంది. ఈవిధంగా రైతువుద్యమం ముందుకు సాగుతూనేవుంది.

పోటీసంఘాలకు చోటివ్వరాదు

ఈ విధంగా పనిచేసే రైతుసంఘాలపై రంగా ముఠా, జమీన్‌రైతు పత్రిక దుమ్మెత్తిపోశారు. సంఘాలను విచ్ఛిన్నం చేయడానికి ఎన్నో ప్రయత్నాలు చేశారు. కాని, అపప్రథేమీ ఉడకలేదు. చివరకు, సంఘాలను తిట్టడంవల్లా, బహిష్కరించటంవల్లా తామే ప్రజలకు దూరమౌతున్నట్లు గుర్తించారు. కాబట్టి తిరిగి రైతుసంఘాలపై పెత్తనం వహించటానికి, పోటీ సంఘాల నేర్పర్చ పూనుకుంటున్నారు. సక్రమంగా ఏర్పడి, చురుకుగా, సమర్థతతోపనిచేస్తూన్న, పూర్వం నుండీ వున్న సంఘాలుండగా, పోటీ సంఘాలు పెట్టడం నాయకత్వం కోసం తలబెట్టే అవకాశవాదుల ఎత్తుగాక మరేమిటి?

రైతువుద్యమ శ్రేయస్సుకు భంగకరమైన రంగా ముఠా ఈ ఎత్తులను గుర్తించవలసినదిగా రైతులనూ, దేశభక్తులనూ, కోరుతున్నాను. ఈనాడు పనిచేస్తున్న రైతుసంఘాలకు పోటీగా సంఘాలను పెట్టడం, నాయకత్వంకోసం పెనగులాడే రంగా ముఠా ఎత్తులను బలపర్చటంగాని రైతువుద్యమానికి తోడ్పడటంకాదు. ప్రజా ఉద్యమాలలో చీలికలు రావటంవల్ల కల్గేదుష్ఫలితాలను గూర్చిన ఉదాహరణలు చరిత్రలో అనేకం వున్నాయి. వాటి గుణపాఠాలను గుర్తించండి. 'ఐక్యతవల్ల జయిస్తాం; చీలికలవల్ల నశిస్తాం' అనే సత్యాన్ని మర్చిపోవద్దు. అందరం కలిసి పనిజేద్దాం: రైతుసంఘాలను బలపర్చుదాం: మనల నెదుర్కొంటున్న సమస్యలను ఐక్యతతో పరిష్కరిద్దాం.

రైతుసంఘం ప్రజాతంత్ర సూత్రాల ప్రకారం నడిచే ప్రజాసంస్థ. ఇది ఏ ఒక్కరి స్వంత ఆస్తికాదు: ఏఒక్క రాజకీయపార్టీ సర్వాధికారాలక్రిందనూ నడిచేదికాదు. స్వార్థరహితులై, రైతుశ్రేయోభిలాషులైన వారంతా కలసి పనిజేసేసంస్థ. ఆంధ్రలో స్వాతంత్ర్యోద్యమం ఏవిధంగా భారతజాతీయోద్యమంలోని అంతర్భాగమో, త (దువాయి 8 వ పేజీలో)

బుధవారం ప్రజాశక్తి 29-12-43

వేవెల్ ఉపన్యాసం

కొత్తవైస్రాయి వేవెల్ అధికారం స్వీకరించిన తరువాత రెండునెలలకు బహిరంగోపన్యాస మిచ్చాడు. కలకత్తాలో, అసోసియేటెడ్ వర్తకసంఘ వార్షిక సమావేశాన్ని ప్రారంభిస్తూ 20 వ తేదీన మాట్లాడాడు. క్లిష్టసమయంలో, ఉత్తరాఫ్రికాయుద్ధంలో భారతదేశ సైన్యాలు వీరత్వంతో పోరాడినందువలననే 1943 లో మిత్రమండలి విజయాలను సంపాదించిందని భారతసైన్యాలను కొనియాడాడు. ముందు హిట్లరును ఓడించాలనీ, తర్వాతనే తూర్పున తీవ్రమైనయుద్ధం ప్రారంభమవుతుందనీ చెప్పాడు. "జర్మనీవలెనే జపానునుకూడ పూర్తిగా ఓడించివేయనిదే ఆర్థికంగాకాని, మిలిటరీగాకాని రక్షణలేదు. బ్రిటిషు సామ్రాజ్యంలో కోల్పోయిన భాగాలను తిరిగి సంపాదించడమనేదిగాని, లేక చమురు, రబ్బరు, వగైరా ముడిపదార్థాలను పంచుకోడమనేదిగాని, నేటిసమస్యగాదు. నాగరికతకే భంగకరమైన మందగీదుతనాన్ని నాశనంచేయడమే నేటికర్తవ్యం. జపాన్ దురాశలను నాశనం చేయడంపైన ప్రపంచంయొక్క భావిశాంతిసౌఖ్యాలు ఆధారపడివున్నాయి." అన్నాడు.

ఆహారసమస్య అన్నిటికంటే ముందు పరిష్కరించవలసినదని వేవెలుప్రభువు పత్రించాడు. "ఆహారసమస్య, రాష్ట్రానికి సంబంధించినది మాత్రమేకాదు. అది అఖిలభారత సమస్య; ప్రపంచసమస్యకూడ. ఇండియా అవుసరాలకు సరిపోయినంత ఆహారం కావాలి." అని అన్నాడు. ఇండియాకు సహాయంగా మిత్రరాజ్యాలు ఎగుమతులు పంపడానికి తయారుగా వున్నాయి అని వైస్రాయి తెలియజేశాడు. కాని ఆహారసమస్య ముఖ్యంగా న్యాయమైన పంపకంపై ఆధారపడివుందన్నాడు. ఖరీదుల కంట్రోలు, పట్టణాలలో రేషనింగు, పెడితేనే పంపకం సరిగా జరుగుతుందని స్పష్టపరిచాడు. ప్రభుత్వం వీటిని అమలుజరుపుటలో ప్రజల సహకారాన్ని అపేక్షించాడు. తమస్వార్థాన్ని, లాభాలనుమాత్రమే చూసుకొనేవారిని దేశక్షేమానికి వ్యతిరేకులని ప్రజలు అసహ్యించుకొంటే ఆహారసమస్యా పరిష్కారం విషయంలో ముందంజ వేయగలమని వైస్రాయి అన్నాడు. అనగా ప్రజల సహకారంయొక్క విలువను గుర్తించవలసివచ్చింది.

ఆహారపదార్థాల కంట్రోలును అమలు జరుపడానికి ప్రభుత్వం కఠినమైన చర్యలను తీసికొంటుందని వెవెల్ తెలియజేశాడు. ఆహారం, మందులలో విపరీత లాభాలను గుంజేవారిని ఎంత కఠినంగా శిక్షించినా తప్పులేదన్నాడు. బట్టలు, వ్యవసాయ పనిముట్లు వగైరా ఇతర వస్తువుల ఖరీదులనుకూడ కంట్రోలుచేయడానికి ప్రయత్నించుతున్నామన్నాడు. ఇన్‌ఫ్లేషన్ తగ్గించడం, బొగ్గు ఉత్పత్తి హెచ్చు చేయడం, యుద్ధానంతరం భారత వ్యవసాయాన్ని– పరిశ్రమలను అభివృద్ధిచేయడం, మొదలగు విషయాలను గురించి కూడా ముచ్చటించాడు.

పైవన్నీ భారతదేశం నేడు ఎదుర్కొంటున్న ముఖ్యసమస్యలే. వాటన్నిటిని పరిష్కరించడానికి వేవెల్ మార్గాలను సూచించుతున్నాడు. కాని వీటిని జయప్రదంగా అమలు జరుపగలిగిన ప్రజల సహకారం సంపాదించడానికి మార్గాన్నిమాత్రం వైస్రాయి సూచించలేదు. నేడు భారతదేశ వాతావరణాన్ని కదల్చివేసే ముఖ్యసమస్యలన్నిటికి మూలకారణమైన రాజకీయ ప్రతిష్టంభన తొలగించడానికి కొత్త వైస్రాయి ఎట్టి ప్రయత్నమూ తలపెట్టలేదు. ప్రతిష్టంభన తొలగించుటద్వారానే, పై సమస్యలన్నిటినీ పరిష్కరించడానికి ప్రజలసహకారం లభించుతుందనే సత్యాన్ని వైస్రాయి గుర్తించినట్లులేదు. కాంగ్రెసునాయకులను విడుదలచేసి, రాష్ట్రాలలోను, కేంద్రంలోనూ, ప్రజాప్రతినిధులతోకూడిన సంయుక్తమంత్రివర్గాలకు అధికారం అప్పగించినపుడే ప్రజలనుండి సంపూర్ణమైన సహకారం లభించుతుందనే సంగతి వేవెల్ ఎంతత్వరగా గ్రహించితే అంత మంచిది.

"రాజకీయ సమస్యను గురించి మాట్లాడకపోవడానికి కారణం భారతీయుల స్వపరిపాలన కాంక్ష యెడల సానుభూతిలేకకాదు; యుద్ధం జరుగుతుండగా రాజకీయాభివృద్ధి అసాధ్యమనికాదు; ప్రస్తుతం దానిని గురించి నేను మాట్లాడడంవల్ల ఆ సమస్యా పరిష్కారం సులభమవుతుందనే నమ్మకం నాకులేదు." అని గోడమీద పిల్లివాటంగావేవెల్ తప్పుకొన్నాడు. కానివేవెల్ ఉపన్యాసంలోయిచ్చినప్లాను–ఆహార పదార్థాల కంట్రోలు, రేషనింగు, అధికోత్పత్తి, ఇన్‌ఫ్లేషన్ తగ్గించడం – అంతా జయప్రదంగా అమలుపరచాలంటే ప్రజా సహకారం అవసరం. రాజకీయ సమస్యా పరిష్కారంద్వారానే అది లభిస్తుంది. అందుకోసం ప్రయత్నించకుండా వేవెల్ ఉద్యోగులపైననే ఆధారపడుతున్నాడు. ప్రజలను పీడించడంమాత్రమే ఎరిగిన ఉద్యోగులపై ఆధారపడి యీ బ్రహ్మాండమైన సమస్యలను పరిష్కరించగలమనుకోడం "కుక్కతోకపట్టుకొని గోదావరి యీదడానికి" ప్రయత్నించడంవంటిదే.

"తమనాయకులు జైళ్ళలోవున్నారని, తాము బానిసలమని" అసంతృప్తితో వుండే ప్రజలు మనస్ఫూర్తిగా యుద్ధకృషికి తోడ్పడజాలరు. ఇన్‌ఫ్లేషన్ తగ్గించడానికి అవుసరమైన యుద్ధబాండ్లను విరివిగాకొనరు–అలాగే ప్రభుత్వ కంట్రోలును తప్పించుకొని దొంగవ్యాపారంచేసేవారిని దేశద్రోహులుగా ప్రజలుఅసహ్యించుకోడం లేదు.అందువల్లనే దుర్భరక్షామానికి ముఖ్యకారకులైనతిండిదొంగలు తప్పించుకోగల్గుతున్నారనే సంగతి మరువరాదు. ఈ సంగతి గుర్తించితే జయప్రదమైన యుద్ధకృషికోసం, ఇన్‌ఫ్లేషన్ తగ్గించడానికి, ఆహారంవగైరా అవుసరవస్తువుల కంట్రోలు. రేషనింగు అమలుజరుపడానికీ భారత రాజకీయ సమస్యా పరిష్కారం వెంటనే జరగాలి. అపుడే వైస్రాయిఉపన్యాసంలోనితక్కినప్లాను జయప్రదంగానెరవేరుతుంది.

సోవియట్ యుద్ధక్షేత్రం

కీవ్ రంగంలో కథ అడ్డంతిరిగింది



జనరల్ వాటిటిన్

నాజీల చెరనుండి సోవియట్ బాల్టిక్ దేశాలను త్వరలోనే విముక్తిజేసే శుభదినం ఆసన్నమయింది. ఈరంగంలో పాల్గొనే రెడార్మీకి "బాల్టిక్ యుద్ధరంగ ప్రధమసైన్యాలు" అని పేరుపెట్టడమే, ఆ దినమెంతో దూరాన లేదని తెలియజేస్తోంది.

బాల్టిక్ దేశాలకుపోయే మార్గంలో ముఖ్య దుర్గమైన విటెబ్‌స్క్ రెడ్‌ఆర్మీ చుట్టుముట్టింది. ఎన్నాళ్ళనుండో నిర్మించుకొని దిట్టపరచుకొన్న జర్మను శ్రేణులను రెడ్‌ఆర్మీ తుత్తునియలు గావించింది. అడ్డూ అపులేని మహాసముద్ర ప్రవాహంలా రెడార్మీసైనికులు టాంకులు, ఫిరంగులు వచ్చి పడుతున్నాయని మాస్కోరేడియో ప్రకటించింది. విటెబ్‌స్క్‌కు ఉత్తరంగానున్న గొరొడోక్‌ను రెడ్‌ఆర్మీ వశపరచుకొంది. అక్కడనుండి జర్మన్లు తిరోగమించ ప్రారంభించారు. కాని, ఆతిరోగమనం క్రమపద్ధతిని సాగనీయకుండా రెడ్‌ఆర్మీ వెంటపడింది. పలాయనం చిత్తగించుతున్న జర్మనుసేనలను చెల్లాచెదరు చేసి నాశనంజేస్తోంది.

పోలొటస్క్ అనే పట్టణం 1939 నాటి పోలండు సరిహద్దులకు, బాల్టిక్ దేశాలకు ముఖద్వారంగావుంది. విటెబ్‌స్క్‌నుండి పొలొటస్క్‌కు పోయే రైలుమార్గాన్ని రెడ్‌ఆర్మీ తెగగొట్టివేసింది. ఒకానొక ప్రదేశంలో విటెబ్‌స్క్‌కు 8 మైళ్ళలోకే రెడ్ ఆర్మీ వచ్చింది.

రెడ్‌ఆర్మీ సాగించిన ఈ దండయాత్ర ఫలితంగా అప్పుడే 1000 గ్రామాలు పట్టణాలు నాజీల చెరనుండి తప్పించబడ్డాయి.

ఈ దండయాత్ర ఉద్దేశం లాట్వియా పోలిష్ సరిహద్దులను చేరడమేగాదు. నిరంతర విమానదాడులకు గురిఅవుతున్న లెనిన్‌గ్రాడ్‌ను పూర్తిగా విముక్తిగావించడంకూడా దీని ఆశయం.

ఇంకా దక్షిణంగా ష్లోబిన్‌వద్ద జర్మనులు తిరుగుదాడులుప్రారంభించారు. ఒక్కరోజున 16 తిరుగుదాడులను జనరల్ రొకోసొవస్కీ సైన్యాలుతిరుగగొట్టాయంటే, ఇక్కడ యుద్ధ తీవ్రత ఎంతో గమనించవచ్చు.రొకోసోవస్కీ సైన్యాల పార్శ్వభాగంలో ప్రిపెట్ బురదనేల వుంది. ఇదివరకు మంచు కరిగియుండటంవల్ల, ఇది జర్మనుసైన్యాలకు ప్రతిబంధకంగా వుంది. ఇపుడు మంచుగడ్డకట్టి టాంకులు రావడానికి వీలేర్పడింది. అందుచే రోకొసోవిస్కీ సైన్యాల పార్శ్వభాగంలో జర్మన్లు తీవ్రంగా ఎదురుదాడులు చేస్తున్నారు. కాని ఈ ఎదురుదాడులు కీవ్‌రంగంలో వలెనే విఫలమవుతాయని చెప్పవచ్చు.

జర్మన్లు కొద్దిప్రదేశంలో ఎక్కువ సైన్యాలను కేంద్రీకరించి కీవ్‌రంగంలో ఎదురుదాడులు సాగించారు. రెండువేలకుపైగా టాంకులను ఉపయోగించారుకూడా. నెలరోజులకు పైగా ఈఎదురుదాడులు సాగాయి. ఇక్కడ జరిగిన ప్రచండయుద్ధాలలో, రెడ్‌ఆర్మీ కొంతవరకు వెనుకకు తగ్గవలసివచ్చింది. చేజిక్కిన జితోమర్, కొరోస్టిన్‌లను తిరిగి వదలివేయవలసివచ్చింది.

కాని, జనరల్ వాటుటిన్ తన అప్రతిమాన సాహసంతో జర్మన్లను అడ్డగలిగాడు. గతజులైలో కుర్స్కులోవలెనే, ఇచట జర్మన్లకు పెద్ద పరాజయం సంభవించిందనడానికి నిదర్శనం నాల్గురోజుల క్రితం రెడ్‌ఆర్మీ తిరిగి ఈరంగంలో విజృంభించడమే.

కీవ్ రంగంలో కథ అడ్డంగా తిప్పి, జనరల్ వాటుటిన్ సైన్యాలు ముందుకురుకుతున్నాయి. కీవ్‌కు పశ్చిమాన 60 మైళ్ళ దూరంలో ఈ దాడి విజృంభించింది. 50 మైళ్ళ రంగంలో, రెడ్‌ఆర్మీ 25 మైళ్ళ ముందుకుపోయింది. అప్పుడే 150 పల్లెలు పట్టణాలు రెడ్‌ఆర్మీ వశమయ్యాయి. పది జర్మను డివిజన్లను (ఇందులో 5 టాంకు డివిజన్లు) ఛిన్నాభిన్నంచేశాయి. 15 వేల జర్మన్లు మరణించారు.

స్టాలిన్‌గ్రాడ్, కుర్స్కు విజయాలు, తర్వాతి రెడ్‌ఆర్మీ మహాదండయాత్రలకు ఎలా దారితీశాయో, కీవ్ రంగంలోని ఈ విజయంకూడా అలాగే దారితీసిందనవచ్చు.

నీపరుమలుపులో ఖెర్సన్‌నుఖాళీచేశామని, నికోపాల్‌వద్ద రెడ్‌ఆర్మీ కొత్తదండయాత్ర ప్రారంభించిందని జర్మన్లు చెప్పుతున్నారు. కాని ఈ వార్తలు ఇంకా దృఢపడలేదు.

ఈ విజయవార్తలు, 3 లక్షల 80 వేల మంది ఎర్రసైనికులు (స్కీ-ట్రూప్స్) మంచుమీద వడిగా పోయే తర్ఫీదును పొందుతున్నారని మాస్కోచెప్పిన వార్త, త్వరలోనే యావత్ సోవియటు భూమీ నాజీల చెరనుండి విముక్తిగావించబడుతుందని తెలియజేస్తోంది.

ఇతర ప్రదేశాలలో ముఖ్య వార్తలు

ఇటలీ :

అడ్రియాటిక్ తీరంలో ఆర్టోనా మిత్రరాజ్యాల వశమయింది. ఇది పెస్కారాకు దక్షిణాన 12 మైళ్ళలోఉ ది. పెస్కారానుండి రోముకు, రైలురోడ్డు మార్గాలున్నాయి.

పసిఫిక్ :

న్యూబ్రిటన్‌లో అమెరికా సైన్యాలు దిగి ఆర్వే ద్వీపకల్పాన్ని వశపరకొన్నాయి. నైరుతిపసిఫిక్‌లో జపానుకిది పెద్దదెబ్బ. ఆర్వేకు 200 మైళ్ళ దూరంలోనేరాబాల్‌వుంది. రాబాల్ నైరుతి పసిఫిక్‌లోజపానుకుపెద్దదుర్గం.

స్వతంత్ర ఫ్రాన్సు:

స్వతంత్రఫ్రెంచి కమిటీ సిరియా, లెబనాన్‌లతో ఒక ఒడంబడికచేసికొంది. దీని ఫలితంగా పోస్టు, టెలిగ్రాఫ్, కస్టమ్సుపై ద్వంద్వాధికారం(ఫ్రాంసుకు లెబనాన్ లేక సిరియాలకు కలిసిఉండే అధికారం) నశిస్తుంది. వాస్తవంలో మాండేటరీ అధికారమే రద్దుజేయబడిందన్నమాట. జనవరి ఒకటినుండి ఇది అమలులోకి వస్తుంది.

యుగోస్లావియా :

యుగోస్లావియా ప్రభుత్వంపై పీటరు రాజుకుగల హక్కుల్ని తొలగించుతూ స్వతంత్రయుగోస్లావియా, ఫాసిస్టు వ్యతిరేక సమావేశం నిర్ణయించింది.

ఖార్కొవ్:

30 వేల సోవియట్ పౌరులను దారుణ హింసాకాండకు గురిచేసి విషవాయువులతో నిండిన లారీలలో పడవైచి చంపిన మున్నగు నాజీలను, అతనికి సాయపడిన ఒకరష్యను ద్రోహినీ ఉరితీశారు. 27–12–43

— తుమ్మల వెంకటరామయ్య

పోషించలేక కన్నబిడ్డల్నే అమ్ముకుంది

ఆమెవొళ్ళో ఏడాది పసిబిడ్డవుంది. ప్రక్కనే నాలుగేండ్ల ఆడుబిడ్డ. ఆమె జగ్గయ్యపేట పోవాలి. పాపం తన దగ్గరుంది, ఒక అర్ధరూపాయిమాత్రమే. బెజవాడనుండి అర్ధరూపాయితో జగ్గయ్యపేట ఎలా వెళ్తుంది? "బిడ్డమీద గాలిఆరి వెళ్తున్నాను నాయనా, దయయుంచి యీ డబ్బులు తీసుకొని జగ్గయ్యపేట చేర్చండి బాబు" అంటూ జాలిగొలిపేలా బ్రతిమాలుతోంది. కండక్టరు కూడా జాలి పొందాడు. ఆకారులోనే నేను నందిగామ పోతున్నాను. ఎంతోజాలిగొల్పే ఆమెమాటలు ప్రతివారి హృదయాన్ని కరిగించాయి. "నీ బిడ్డ జగ్గయ్యపేటలో ఎందుకుంది" అని అడిగాను. ఎంతో విచారాన్నిగొల్పే ముఖంతో "పెంచలేక 40 రూపాయలకి నల్లకొండలో ఒకనికి అమ్మానమ్మా" అని జవాబు చెప్పింది. నాకుఆశ్చర్యం వేసింది. ఆమె కథను పూర్తిగా తెలుసుకోవాలనిపించింది.

ఆమె భర్తకు పిచ్చెక్కింది. దేశాలవెంట పోయాడు. పాపం! అనాటికున్న ఐదుగురి బిడ్డల్ని తాను ఒకర్తె ఎలా పోషించ గల్గుతుంది? అలాగే కొంతకాలం సంసారాన్ని ఈడ్చింది. పెద్ద బిడ్డకు పదేళ్ళు నిండాయి. బంధువులలోనే ఒకరికిచ్చి ముడివేద్దామని అనుకుందట పాపం. దగ్గర బంధువులే కాలదన్నారు. పేదరికంలో ఎవరాదుకుంటారు? ధరలు పెరిగిపోయాయి. జీవిత నిర్వహణమే భారమైంది. ఆమెకు బిడ్డలను అమ్ముకోడం దప్ప మార్గం కన్పించలేదు. పోషించలేక, బిడ్డల చావు కళ్ళార చూడడం మాతృహృదయం సహిస్తుందా? అమ్మడానికే నిశ్చయించుకుంది. ఒక బిడ్డను కంచకచర్లలోను, మరొకబిడ్డను నల్లగొండలోను అమ్ముకుంది. మూడోబిడ్డను యేమహానుభావులైనతీసుకుంటే యిస్తాను అని చెప్పి ముగించింది. ఇంతలోనే ఎంత కమ్ముతావూ అని ప్రక్క సీటులో కూర్చున్న వర్తకుడు అడిగాడు. "మీయిష్టమొచ్చినంత యివ్వండి బాబు" అని ఆవిడ అంది. "నీవేం చేసుకుంటావయ్యా" అని హాస్యంగా ప్రశ్నించాడు మరొక వ్యక్తి. "నాలుగేళ్ళు కష్టపడి పెంచితే" నిక్షేపంలా రు 1000 లు ఇచ్చి ఏనైజాం వర్తకుడైనా కొంటాడు.నష్టమేముందయ్యా" అని అన్నాడు. నందిగామ చేరింది బస్సు. నేను దిగిపోయాను. చివరకు ఏంజరిగిందో తెలియదు. యీ ఘటన చూచినప్పటినుండి బెంగాల్ పరిస్థితి అంతా ఒకసారి స్ఫురణకు వచ్చింది. ఆహారసమస్య విషమించి, బెంగాలులాంటి పరిస్థితులు ఆంధ్రరాష్ట్రంలో వెనుకబడ్డ ప్రాంతాలలో యిలాంటి ఘటనలు జరుగుతున్నాయి గదా అని హృదయం కంపించింది. మహిళాలోకమంతా ఆహారసమస్యను క్లిష్టతరంగానివ్వకుండా నడుం కట్టకపోతే జాతి అంతటికీ ఎలాంటి విపత్తు సంఘటిల్లుతుందో యీ దృశ్యం మనకు గోచరింపజేస్తుంది.

— కొండపల్లి కోటేశ్వరమ్మ

నందిగామ తాలూకాలో మహిళాసంఘ ప్రచారం

కృష్ణాజిల్లా నందిగామ తాలూకాలో నవంబరు 26 వ తేదీనుండి డిశంబరు 16 వ తేదీ వరకు, కామ్రేడ్స్ వాసిరెడ్డి వరమల్లేశ్వరి, గుంటుపల్లి సరస్వతమ్మ, జిల్లామహిళాసంఘ ఆర్గనైజరు కొండపల్లి కోటీశ్వరమ్మగార్లు మహిళాసంఘ ఆశయాలు, ఆవశ్యతనుగూర్చి చందాపురం, కొణతమాత్మకూరు, దాచవరం, పెద్దవరం, చెర్వుకొమ్ముపాలెం, పేరకలపాడు, పొన్నవరం, కంచకచర్ల, మున్నలూరు గ్రామాలలో ప్రచారం చేశారు. 7 గ్రామాలలో10గృహసమావేశాలుజరిపి 182 మందిని సంఘంలో చేర్పించారు. సమావేశాలకు 254 మంది స్త్రీలు హాజరయ్యారు. జిల్లా మహిళా క్యాంపుకు 40 మంది రు 21-10-0 లు విరాళాలు యిచ్చారు.

ఈ తాలూకా విజ్ఞానంలో చాలా వెనుకబడినప్పటికి, సోదర మహిళలు అజ్ఞానాంధకారంనుండి బయటపడాలని తహతహలాడుతున్నారు. అవ్వలుకూడా ప్రపంచ పరిస్థితులు తెలుసుకోవాలని, ఉత్సాహాన్ని కన్పరచారు. దాచవరంలో 60 సంవత్సరాల వయస్సుగల అవ్వ, చొరవతో సభ్యుల్ని చేర్పించి, విరాళాలు ప్రోగుజేసి యిచ్చింది. ఇదే విధంగా ప్రతి గ్రామంలో స్త్రీలు ప్రపంచపరిస్థితులు తెలుసుకోడానికి ముందుకు వస్తున్నారు.

రావుకమిటీ బిల్లు త్వరలో అమలుపరచాలని కోరే మహజరుపై 123 సంతకాలు సేకరించబడ్డవి.

మరుగుదొడ్లు కట్టించేప్రయత్నం

వీరులపాడు (నందిగామతాలూకా) లో మరుగుదొడ్లు లేక స్త్రీలు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఈ అసౌకర్యాన్ని తొలగించవలసిందని 112 మంది స్త్రీలు ఒక అర్జీని తహసీల్‌దారుకు పంపారు. వూరిబైటనున్న ఖాళీస్థలంలో 20 సెంట్లు మరుగుదొడ్లకు మంజూరు చేయవలసిందిగా తహసీల్‌దార్ వద్దకు మహిళావర్కర్లు రాయబారం వెళ్లారు. తహశీల్‌దారు తానా గ్రామం వచ్చినప్పుడు ఈ అర్జీనిగురించి ఆలోచిస్తామని చెప్పారు.

* * *

బందరులోని రాజుపేటలో మరుగుదొడ్డి కట్టించవలసిందని కోరుతూ మహిళాసంఘం ఒక అర్జీని మ్యునిసిపాలిటీకిపంపింది. ఆ అర్జీపై 113 మంది సంతకాలు చేశారు. ముగ్గురు మహిళావర్కర్లు కమీషనర్‌వద్దకు 7-12-43 న రాయబారం వెళ్ళారు. త్వరలో హెల్త్‌ఆఫీసరును రాజుపేట పంపి విచారించుతామని కమీషనర్ వాగ్దానం చేశారు.

ఇదివరలో, సుకర్లాబాదు (బందరు)లో జరిపిన ఆందోళన ఫలితంగా, మరుగుదొడ్డి కట్టడానికి స్థల నిర్ణయం జరిగింది. త్వరలోనే దొడ్డిని కట్టించుతామని కమీషనర్ తెలియజేశారు.

8-12-43 న నరసాయపాలెం (గుంటూరు జిల్లా)మహిళాసంఘ కార్యవర్గసమావేశంలో, పంచాయితీబోర్డు మరుగుదొడ్డిని కట్టించవలసిందని కోరుతూ తీర్మానించబడింది. (మరొక తీర్మానంలో, మంత్రసానికోసం జిల్లా హెల్త్‌ఆఫీసరుగారికి మహజరుపెట్టి, ఆందోళన చేయాలనికూడా తీర్మానించబడింది.)

అఖిలభారత రైతుమహాసభకు యేర్పాట్లు

అఖిలభారత రైతుమహాసభ ఆహ్వానసంఘంయొక్క ఆర్గనైజింగ్ కమిటీ 12–12–43 వ తేదీని సమావేశమై, మహాసభకు యేర్పాట్లుచేయడానికి యీక్రింది కమీటీలను నియమించింది.

1. నిర్మాణాల ఉపసంఘం :— ముక్కామల నాగభూషణంగారు (కన్వీనరు): కాట్రగడ్డ నారాయణరావుగారు, ఎం.ఎల్.ఏ.; జాలాది రామకోటయ్యగారు.

2. ప్రచారక ఉపసంఘం:—కాట్రగడ్డ రాజగోపాలరావుగారు (కన్వీనరు); నందూరి ప్రసాదరావుగారు; చదలవాడ పిచ్చయ్యగారు; వావిలాల గోపాలకృష్ణయ్యగారు; కొల్లా వెంకయ్యగారు; రాటకొండ నరసింహారెడ్డిగారు.

3. ఆర్థిక ఉపసంఘం :—కడియాల గోపాలరావుగారు (కన్వీనరు); కాట్రగడ్డ నారాయణరావుగారు; పిడికిటి వెంకటేశ్వరరావుగారు.

4. వాలంటీరు ఉపసంఘం :—కొండపల్లి సీతారామయ్యగారు (కన్వీనరు); చంద్ర రాజేశ్వరరావుగారు; వెల్లంకి విశ్వేశ్వరరావుగారు; వి. ప్రసాదరావుగారు; మోటూరి పరంధామయ్యగారు; వేములపల్లి వెంకటదాసుగారు.

కమ్యూనిస్టు అభ్యర్థులకు అఖండ విజయం

ప్రజల దైనందినసమస్యల నెదుర్కొని, వాటిని తీర్చడానికి పనిచేసే సంస్థను ప్రజలు బలపరుస్తారు. ఈ మధ్య వెలుగోడు (కర్నూలుజిల్లా) లోన, సత్తెనపల్లి (గుంటూరుజిల్లా)లోను పంచాయితీబోర్డు ఎన్నికల ఫలితాలే ఇందుకు నిదర్శనం. ఈ ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీతరఫున అభ్యర్థులు నిల్చున్నారు. వారికి అఖండవిజయం లభించింది.

కరువుబాధతో కటకటలాడిన రాయలసీమలోనిది కర్నూలుజిల్లా. ఆజిల్లాలోకూడా, అధికలాభాలకోసం షాహుకార్లు దొంగమార్కెట్లు ప్రారంభించారు. ముందుసంవత్సర మెలా ఉంటుందో అనే భయంతో పెద్దరైతులు ధాన్యాన్ని మార్కెట్టుకు తేలేదు. ఇక ప్రజా సామాన్యం సంగతి అడగాలా? పరిస్థితులు విషమించి చివరికి దోపిళ్ళకు దారితీశాయి. దానితో ప్రభుత్వంమేలుకొంది.

జిల్లా అంతటికీ ఆహారపదార్థాలు సప్లయి చేయడానికి కర్నూలులో ఒక హోల్‌సేల్ కో-ఆపరేటివ్ స్టోర్సుస్థాపించారు. అదివరకే ఆహారపదార్థాల కరువు సమస్య నెదుర్కొని స్థానిక కమ్యూనిస్టులు శక్తికొలది కృషిచేస్తున్నారు. స్టోర్సు ఏర్పడినదగ్గర్నుంచి, దాన్ని అవకాశంగా తీసుకొని పనిచేయసాగారు.

ఇలాపనిచేసిన ప్రదేశాల్లోనందికొట్కూరు తాలూకాలోని వెలుగోడుగ్రామం ఒకటి. ఆహారసమస్యను పరిష్కరించడం ద్వారా జాతీయైక్యతను నిర్మించగలము, తద్వారా జాతీయ సంక్షోభాన్ని తొలగించగలమనే సూత్రాన్ననుసరించి కమ్యూనిస్టుపార్టీ కృషి చేసింది. వెలుగోడులో కో-ఆపరేటివ్‌స్టోర్సును స్థాపించారు. గ్రామంలోని ప్రజల అవసరాలను లెక్కగట్టి, దానిప్రకారం జొన్నలు, సజ్జలు, బియ్యం మొదలయిన సరుకుల సప్లయి తెప్పించసాగారు. తగినంతసరుకు రానప్పుడు చేతులు ముడుచుకొని కూర్చోక, పెద్ద రైతులవద్దకు పోయి, వారికి నచ్చజెప్పి సరుకు సంపాదించేవారు. కిరసనాయిల్ లైసెన్సు దారులు చేస్తున్న అక్రమాలను బయటపెట్టి, కిర్సనాయిల్ కూడా స్టోర్సుద్వారానే సప్లయిఅయేలాచేశారు. ఈ సరుకులన్నిటిని ప్రజల అవసరాలను బట్టి సప్లయి చేయసాగారు. దీనితో స్టోర్సు అన్నా, స్టోర్సును నడుపుతూన్న కమ్యూనిస్టులన్నా, ప్రజలకు ఎంతో ఆదరాభిమానాలు కలిగాయి.

ఇంతలో గ్రామ పంచాయితీబోర్డు సమస్య వచ్చింది. బోర్డు అధ్యక్షుడు గ్రామ సౌకర్యాలను లెక్కజేయక, స్వలాభమే ప్రధానంగా చూచుకొంటూ వచ్చాడు. దీనితో అసంతృప్తి చెంది 6 గురు సభ్యులు రాజీనామాలిచ్చారు. ఈనెల 2 వ తేదీన ఈ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. గ్రామస్థుల అంగీకారంపైని ఈ స్థానాలకు కమ్యూనిస్టులు పోటీచేయ నిశ్చయించారు.

ముస్లిం ప్రాంతానికి, ముస్లిం లందరూ అంగీకరించిన అభ్యర్థిని నిలబెట్టారు. మిగతా 6 స్థానాలకు ముగ్గురు సానుభూతి పరులను, ఇద్దరు పార్టీసభ్యులను నిలబెట్టారు.

లాలా హుసేన్‌సాహెబ్‌గారు, మండ్ల వెంకటరెడ్డిగారు (సానుభూతిపరుడు) పోటీ లేకుండా ఎన్నుకోబడ్డారు. వరదా శేషయ్యగారు (సానుభూతిపరుడు) 38 ఓట్ల మెజారిటీతోను, వి. యస్. రామమూర్తిగారు పదిఓట్ల మెజారిటీతోను, ఏ. సుదర్శనవర్మగారు 31ఓట్ల మెజారిటీతోను, యస్. నరసింహాచార్యగారు (సానుభూతిపరుడు) 31 ఓట్ల మెజారిటీతోను ఎన్నికలలో గెలిచారు. వీరిని ఓడించడానికి బోర్డుఅధ్యక్షుడు విపరీతంగాకృషిచేశాడు. కాని నిత్యమూ తమకష్టసుఖాల నాలోచిస్తూపనిచేసే ప్రజాసేవకులనే ప్రజలు ఎన్నుకున్నారు.

సత్తెనపల్లిలో

సత్తెనపల్లి యూనియన్‌బోర్డు ఎన్నికలు నవంబరు 29 వ తేదీన జరిగాయి. 11 వ వార్డు, వడ్డపల్లిలో కమ్యూనిస్టుపార్టీ తరఫున చతుర్వేదుల సీతారామశాస్త్రిగారిని అభ్యర్థిగా నిలబెట్టారు. వీరికి పోటీగా పెద్దవర్తకులు రామిశెట్టి రామయ్యగారిని నిలబెట్టారు. ఇక్కడకూడా ప్రజాసేవకులకే విజయం. పోలయిన 82 ఓట్లలో కమ్యూనిస్టుపార్టీ అభ్యర్థికి 81 ఓట్లు వచ్చాయి. పోటీదారుడికి ఒక్క ఓటుమాత్రమే వచ్చింది.

గనులలో స్త్రీలను నియమించరాదు

14-12-43 న వై. భాగ్యమ్మగారి అధ్యక్షతను సమావేశమైన గవర్నరుపేట (బెజవాడ) మహిళా జనరల్‌బాడీ సమావేశమైంది. స్త్రీలను గనులలో పనిచేయించవచ్చునని ఇటీవల బీహారు, బెంగాలు, మధ్యపరగణాలలో గావించిన చట్టాలను ఖండించుతూ తీర్మానించబడింది.

మరొక తీర్మానంలో, రావుకమిటీ బిల్లు కృష్ణాజిల్లా మహిళాసంఘం సూచించిన సవరణలతో అమలు పరచవలసిందని కోరారు.

మద్రాసు ప్రభుత్వం, మద్యపాననిషేధ చట్టాన్ని రద్దుచేయుటను నిరసించుతూ, నిషేధాన్ని తిరిగి అమలులో పెట్టవలసిందని కోరుతూ మరొక తీర్మానంచేశారు. నర్సాయపాలెం మహిళాసంఘ కార్యవర్గమూ, (8-12-43 న), జిన్నూరు (ప. గోదావరి) మహిళాసంఘ సాధారణ సమావేశమూ (11-12-43 న) ఇలాంటి తీర్మానాలనే గావించాయి.

రాగిపైరు ఎరువులేక ఎండిపోతూంది

గుంటూరుజిల్లా సముద్రప్రాంత రైతులు పేదలు. వీరు రాగిపైరువేస్తారు. రోజువిడిచి రోజు బుంగ (కడవ) పోతతో నీరుపోసి పంటపండిస్తారు. ఈపంటపోతే మరోఆసరా రైతులకులేదు.

రాగిపైరుకు, రసాయనిక ఎరువు అమోనియా అత్యవసరం. అదిలేకపోతే ఎండిపోతుంది. గత సంవత్సరం, అమోనియా ధరను కంపెనీవారు బస్తా రు 27-0-0 లు నిర్ణయించినా, వర్తకులు, ఏజంట్లు 75 రూపాయలకు అమ్మసాగారు. ఈవిషయమై ఆగస్టు 7 వ తేదీన మద్రాసు ప్రభుత్వాన్ని జిల్లా రైతుసంఘం సందర్శించింది. ప్రభుత్వసలహాదారుడు హుడ్, తాను కంపెనీకివ్రాసి అమోనియాను రైతులకు సరఫరా చేయించుతానని జవాబిచ్చారు. కాని అలాంటిదేదీ జరుగలేదు. సెప్టెంబరు 14 వ తేదీన, అమోనియాకు, ఇతరమిశ్రమలకుధరలను ప్రభుత్వంకంట్రోలు చేసింది. దీనితో వర్తకులు కొంతభాగం దొంగమార్కెట్లకు చేరవేసి బస్తా రు. 125-0-0 దాకా పెంచారు.

రైతుసంఘ వాలంటీర్లు చీరాల, పేరాల, వేటపాలెం, చినగంజాం, కొత్తపట్నం, వ్యాపారస్తులవద్ద అమోనియాను పట్టుకొన్నారు. కాని ఒంగోలు, బాపట్ల వ్యవసాయ శాఖాధికారులు వీరికి తోడ్పడడానికి బదులు, కొత్తపట్నం, చీరాలలలో పట్టుకొన్న ఎరువును కొంత, రాగివేసే రైతుల కందజేయకుండా జేశారు. దీనితో మొదటిపంట దెబ్బతింది.

సెప్టెంబరు 23 న గవర్నరు సలహాదారులైన రామమూర్తిగారు, మన రాష్ట్రానికి 5 వేల టన్నులు అమోనియా సరఫరా అవుతుందని ప్రకటించారు. జిల్లా రైతుసంఘం, అధికాహారోత్పత్తిని దృష్టిలో పెట్టుకొని ఈజిల్లాకు సప్లయిచేయవలసిందిగా ప్రభుత్వాన్నికోరింది.

బాపట్ల, ఒంగోలు తాలూకాలలో, రాగి రెండవపంట వేశారు. ఇపుడు అమోనియాను దొంగమార్కెట్టులో రూపాయికి 3 గిద్దలు (క్షి శేరు) చొప్పున వ్యాపారస్థులు అమ్ముతున్నారు.

ఇంతవరకూ రైతులు తమరక్తంతో తడిపి పెంచిన రాగిపైరు, అమోనియా లేక మాడిపోవ ప్రారంభించింది. వెంటనే ప్రభుత్వం అమోనియాను సరఫరా చేయాలి. లేకపోతే ఈప్రాంతాలలోని $1\frac{1}{2}$ లక్షలప్రజలు బెంగాలు లాంటి పరిస్థితులకు లోనుగావలసి వస్తుంది. అందుచే ప్రభుత్వం రైతుసంఘప్రతినిధులతో కూడిన కమిటీ అజమాయిషీక్రింద, అమోనియాను సరఫరా చేయాలి.

చెరుకుగానుగ వేయడానికి అనుమతి ఈయాలి

టన్ను 1 కి రు 25-0-0 ధర నిర్ణయించాలి

తుమ్మపాలెం (విశాఖపట్నంజిల్లా) పంచదార ఫ్యాక్టరీ ప్రదేశంలోని రైతుల ఆందోళనను పెడచెవినిపెట్టి ప్రభుత్వం, చెరకు టన్ను 17-0-0 నిర్ణయించింది. ఇది చెరకు పండించే రైతుల ఆదాయానికి గొడ్డలిపెట్టు. పరిశ్రమకు కూడా నష్టకరం.

పైగా, ఫ్యాక్టరీ సమీప ప్రదేశంలోనే గాక 8 మైళ్ళ దూరానవున్న గ్రామాలలో కూడ చెరకు గానుగ ఆడకూడదని నిషేధం. ఇలా నిషేధింపబడిన 16 గ్రామాలలో మొత్తం 10 వేల టన్నులు చెరుకు తయారవుతుంది. కాని, ఫ్యాక్టరీ పనిచేయడం అనేది ఉంటే, ఇందులో 5 వ వంతే చాలు. టన్ను 25-0-0 చొప్పున ధర నిర్ణయించితే గాని రైతులకు గిట్టుబాటుగాదు.

ఇంతేగాక నువ్వులు, పెసర (చెరకు తర్వాత పంట) వేసుకొనే సమయంవస్తోంది. అందుచే ఫ్యాక్టరీకి అక్కరలేని చెరుకును గానుగ ఆడుకోడానికి అవకాశం ఈయాలి. లేకపోతే రైతులు తిరిగి చెరుకుపంటవేయడం అసంభవం.

అధికోత్పత్తికి అవకాశాలు

అనకాపల్లి తాలూకా, కశింకోట ఎస్టేటులోని చుంచుకొండ ప్రాంతంలో చక్కటి పల్లపు భూములలో జలాధారములు బాగులేక మెట్టపంటలు పండుతున్నాయి. కొన్నివందల ఎకరాలపల్లంలో వరి, బేడపంట పండుతోంది. కొద్దిపాటి ఖర్చులతో కట్టలు మరమ్మతులు చేస్తే, కొన్నివందల గరిసెలధాన్యం పండించవచ్చును.

1. కొంజేరుకట్ట బాగుచేయించి ప్రభుత్వ జలాశయమైన కొండకర్ల ఆవనుండి నీరు సప్లయిచేస్తే 100 గరిసెల ధాన్యం పండించవచ్చును. మరమ్మతులకు 2000 రూపాయల కంటె హెచ్చు అవదు.

2. గనపర్తికట్టకు తలుపులువేసి బాగుచేసి, కొండకర్ల ఆవనుండి విరగడికాలువ ద్వారా రోలు గెడ్డలోనికి నీరు సప్లయిచేస్తే 400 ఎకరాలు కొత్తగాసాగులోనికి వస్తాయి. మరమ్మతులకు 10000 రూపాయలు అవసరం.

3. విరగడికట్ట సుమారు 30 సంవత్సరములనుండి మరమ్మతులు లేక శిధిలమై ఉన్నది. 10000 రూపాయలుపెట్టి మరమ్మతు చేయిస్తే 800 ఎకరాలు సాగులోనికి వస్తుంది.


4. ఇలాగేవిజయనగరం ఎస్టేటులోని పెదుళ్ల గెడ్డ ప్రోజక్టు 12000 రూపాయలు ఖర్చుపెట్టి నిర్మిస్తే 1000 ఎకరాలలో వరి చక్కగా పండించవచ్చును.

అనకాపల్లి తాలూకాలోనే చేనుల అగ్రహారం అనే మొఖాసాగ్రామంలో 40 సంవత్సరముల క్రిందట 600 గరిసెలు ధాన్యం పండించేవారు. ఆనకట్ట పాడవడంవల్ల యిప్పుడు 6 గరిసెలకంటెఎక్కువపండడంలేదు. ప్రజలు తిండికి, గుడ్డకు అల్లాడిపోతూ అవి ఎప్పుడు బాగవుతుందోనని తహతహలాడుతున్నారు.

కోయలు కొరగాని జీవులయారు

కోరాపుట్ జిల్లాలో మల్కనగరి అనే తాలూకా ఉంది. అక్కడ అమాయకులైన కోయజాతి ప్రజల్ని ప్రభుత్వోద్యోగులు పెట్టే బాధలు ఇన్నీ - అన్నీకావు. సాధారణంగా వీరు ఆవులవల్ల, గేదెలవల్ల వచ్చే నేతిని, వ్యవసాయంవల్ల వచ్చే ధాన్యాన్ని, అమ్ముకొని జీవిస్తారు. అయితే, ప్రపంచం అంతటా ప్రతి వస్తువుకు ధర పెరిగినా, యీ ప్రాంతములో మాత్రం యుద్ధానికి పూర్వపు ధరలే ! ప్రభుత్వోద్యోగులు అనేక నిర్బంధాలు ప్రయోగించి, రు. 2-8-0 ఖరీదు చేసే నేతిని 0-8-0 కూ, బస్తా రు. 11-0-0 ఖరీదుచేసే ధాన్యం బస్తాను రు. 2-8-0 కూ, కొంటారు. ఆ ఉద్యోగస్తులైనా తమ కుటుంబాలకు సరిపోయే సరుకునుమాత్రమే కొని ఊరుకుంటే, బాధ ఉండదు. కాని జరిగేది యేమంటే, వీరు డబ్బాలకొద్దీ నెయ్యి, పుట్లకొద్దీ ధాన్యం, కొని నాలుగైదురెట్లులాభానికిఅమ్ముతున్నారు. "ఇదేమి అన్యాయం?" అని ఎవరయినా ధైర్యంచేసి అడిగితే, అట్టివారిమీద కేసులు బనాయించుతారు. పదిసార్లూ-పన్నెండుసార్లూ కోర్టుకు తిప్పించి, జరిమానాగాని, శిక్షగాని విధించబడుతుంది. ఇలా కోర్టులకు తిరిగితే, వ్యవసాయంకాస్తా పడుకుంటుంది. అందువల్ల కోయలు ఎదురుమాటాడక, అడిగిన ధరకు సరుకు యివ్వడం పరిపాటయింది. ఈ అన్యాయాన్ని గురించి పై అధికారులకైనా చెప్పుకుందామా అంటే, "కుక్క దొరికితే కర్రదొరకదు; కర్రదొరికితే కుక్క దొరకదు; రెండూ దొరికితే అది రాజుగారి కుక్క అవుతుం"దన్నట్లు, అధికారులు వచ్చే రోజు కోయలకు తెలియదు; కోయలు వేచియున్న రోజున అధికారులురారు; రెండూ సందర్భపడితే, తెలుగుతెలియని అధికారులకూ - ఓఢ్రముగాని, ఇంగ్లీషుగాని తెలియని కోయలకూ మధ్య ఉద్యోగస్తులు పందిని నంది - నందినిపంది చేస్తారు !

కోయలకు జరిగే యీ అన్యాయాలను ఎదుర్కొంటూ, మోటు ఆంధ్ర యువజన సంఘంవారు ప్రచారంచేస్తున్నారు. జిల్లా అధికారులు యిట్టి దోపిడీని అరికట్టి, కింది ఉద్యోగస్తులపై చర్య తీసుకోవడం అవసరం.



215 గురు రైతులు, కూలీలు - స్త్రీలు, పురుషులు, వృద్ధులు, బాలురు - ఏకకుటుంబంగా చేనుకోశారు, పాములపాడులో. దేనికోసం? తమసంఘాలనుబలపర్చుకొని, ఆహారసమస్యను పరిష్కరించుకోవడంకోసం ! దేశరక్షణను సాగించడంకోసం !

రెండవపంటకు ఆందోళన

15-12-43 న కోవూరు తాలూకా (నెల్లూరుజిల్లా) రైతుసంఘం, జిల్లాకలెక్టరుకు ఒక పిటీషను పెట్టారు. అందులోని విషయాలివి : రెండవకారు పంట బ్లాకులో దంపూరు, వూటుకూరు, అలగానిపాడు, గ్రామాలను కూడా చేర్పించాలి. రెండవకారుకు ప్రదేశ నిర్ణయం వెంటనే జరపాలి. అలా చెప్పనందువల్ల విత్తనాలు సేకరించుకోడానికి ఇబ్బంది అవుతుంది. రెండోకారు లేని ప్రదేశం ఫలానిదని తెలిస్తే, మినుము, పెసర, వులవ, నీలి, మొదలైనవి వేసుకోవడానికి అవకాశం వుంటుంది. వెంటనే ఇర్రిగేషన్ కాన్ఫరెన్సు జరిపి ఈ క్రింది గ్రామాలను రెండవకారు ప్రదేశంగా నిర్ణయించాలి. అల్లూరు సెక్షను:- మట్టన్ చెరువు, మోపూరు రిగ్యులేటర్, శ్రద్ధగుంట, ఇందుపూరు, పురిణి, గోగురిపల్లి. కొడవలూరు సెక్షన్:- దంపూరు, వావిళ్ళ చెరువు క్రింద వూటుకూరు. కోవూరుసెక్షన్:- ఇనమడుగు, లేగుంటపాడు, చెల్లాపాలెం, మోదేగుంట, వేగూరు, ముదివర్తి.

ఈ పిటిషన్‌కు కలెక్టరు సమాధానమిస్తూ, ఇంజనీరింగు డిపార్టుమెంటుకు వ్రాసి తగిన విధంగా పరిష్కరించుతానని చెప్పాడు.

బందరుతాలూకా ఇర్రిగేషన్ కాన్ఫరెన్సు

14-12-43 వ తేదీన పై కాన్ఫరెన్సు బందరులో తాలూకాకచేరీలోజరిగింది. 20 గ్రామాలనుండి 50 మంది రైతులు హాజరైనారు. బందరు తాలూకాలో 10 వేల ఎకరములు అధికోత్పత్తికొరకు సాగుచేయబడుతుందని ఎగ్జిక్యూటివ్ యింజనీయరుగారు చెప్పారు. తాలూకా రైతుసంఘమువారు తాలూకాలో వ్యవసాయాభివృద్ధికి అవుసరమైన మురుగు వసతులకు, పంటకాల్వల మరమ్మతులు, తూములు ఎక్కువజేయుట, అదనపుసాగుకు ప్రత్యేకంగా తూములు, కాల్వలు, గురించి కొన్ని సూచనలు చేశారు. ఇంజనీయరుగారు అన్ని విషయాలను శ్రద్ధతో విని సమాధానాలు చెప్పారు. ఈ సంవత్సరం తూములు అన్నీ 50 డ్యూటీ ప్రకారం పెంచుతున్నామన్నారు. అదనపుసాగుకు అన్ని సౌకర్యాలుచేస్తామన్నారు. మురుగువసతులు పెంపుజేయుటకు ఆలోచిస్తామన్నారు. తూములు పెంచే విషయంలోమాత్రం ప్రత్యేకంగా అర్జీలిస్తే విచారిస్తామన్నారు. సమావేశం 4 గంటలు జరిగింది. రైతులందరినీ సమీకరించి వ్యవసాయాభివృద్ధికి అవుసరమైన సూచనలనిచ్చినందుకు తాలూకారైతుసంఘాన్ని ఇంజనీయరుగారు అభినందించారు.

20798 ఎకరాలకు రెండోపంటకు నీరు

మద్రాసు ప్రభుత్వ ప్రకటన

తూర్పుగోదావరి జిల్లా తూర్పు, మధ్య డెల్టాల లోకలైజేషను స్కీముపై ప్రభుత్వం ఉత్తరువులు చేశారు. నవంబరు 16 వ తేదీ గెజెటులో ప్రకటించిన స్కీము మేరకు, అదనంగా 20,798 ఎకరములకు, రెండోపంట నీటివసతులు గలిగించారు.

తూర్పుడెల్టాలో అచ్చు జాబితాయందు 3 వ కాలంలో పేర్కొనబడిన పొలాలకు 1944 (ప్రస్తుత ఫసలీ) లో రెండోపంటకు నీరిచ్చారు. మధ్య డెల్టా జాబితాయందు 2 వ కాలంలో నున్న పొలాలకు (విలాసవల్లి అల్లవరం, కౌశికచానలు సిస్టములక్రిందనున్న పొలాలకుకాక తక్కినవాటికి) 1944 సం॥లో రెండో పంటకు నీరిచ్చారు. సదరు మూడు చానలు సిస్టముల క్రిందనున్న పొలాలలో 1 వ కాలంలో చూపబడిన వాటికి నీరిచ్చారు.

రైతులకు యింకను యిక్కట్టులను తొలగించుటకు, స్కీములో యిదివరకు అర్హమైన భూములేకాక, ఛీఫ్ ఇంజనీరు సూచించిన ప్రకారం సెంట్రల్ డెల్టాలో 7000 ఎకరాలకు, తూర్పు డెల్టాలో 6000 ఎకరాలకు, 1944 సంవత్సరం పంటకును, తూర్పుడెల్టాలో 7798 ఎకరములకు నీరిచ్చారు. ఈభూములకు గత రెండేండ్లలో రెండోపంటకు నీరివ్వలేదు.

"కార్మికులంతా ఒకటే!"

ఉయ్యూరు ఫ్యాక్టరీ యజమానికి కార్మికులు నేర్పిన గుణపాఠం

ఉయ్యూరు పంచదార ఫ్యాక్టరీ యజమానులు యూనియనుకువ్యతిరేకంగా కొన్ని షరతులతో బాండులు తయారుచేసి, వాటిమీద కార్మికులచేత సంతకాలు పెట్టించడానికి లోగడ ప్రయత్నించారు. కార్మికులలో చీలికలు తేడానికైనా ప్రయత్నించారు. ఈ పన్నాగాలన్నిటికి కార్మికులు లొంగలేదు. ఇక యితర ప్రాంతాలనుంచి కూలీలను తెప్పించడానికి పూనుకొన్నారు. బందరు నుంచి, బొబ్బిలినుంచి కూలీలను తెస్తున్నారు. వచ్చిన తరువాత పనివారు నిజపరిస్థితుల్ని తెలుసుకొన్నారు. "మమ్ములను మోసపుచ్చి, యిక్కడి పరిస్థితులు తెలియజేయకుండా, మాలోమాకు ద్వేషము కల్పిస్తున్నాడు యీ పెట్టుబడిదారు. మారెక్కలకష్టానికి తగిన జీతాలిచ్చి పనిచేయించుకోవాలి. కాని మా కార్మిక కుటుంబాన్ని చీల్చి దేశానికి ద్రోహం చేయ ప్రయత్నిస్తున్నాడు. కార్మికులమంతా ఒకటే."అని యజమాని మోసాలకు లొంగక బందరుకూలీలు తిరిగివెళ్ళిపోయారు; కష్టించి ప్రజలకు పంచదార తయారుచేస్తున్నారు పంచదార కార్మికులు. యజమాని లాభాలు గడిస్తూ దేశసేవకులగు కార్మికులమీద కత్తిగట్టాడు. కార్మికుల సంఘము బలపడితే తన యిచ్చవచ్చినట్లు కూలీలను హింసించుటకు వీలులేదని, కార్మికులు తమ హక్కులకై పోరాడుతారని, యజమాని యీ అక్రమ చర్యలకు పూనుకున్నాడు. పంచదార కార్మికులు ఎక్కువపంచదారను తయారుచేయాలంటున్నారు. తమ న్యాయమైన హక్కులను గుర్తించాలంటున్నారు. యజమాని ఒక్క తన స్వలాభాన్నే కాకుండా, ప్రజల అవసరాలను గుర్తించి, కార్మికుల శ్రేయస్సు చూడాలంటున్నారు.

కార్మికులకు ఆహారపదార్థాల సప్లయి

కార్మికులకు ఆహారపదార్థాల సప్లయిని గురించి ప్రభుత్వం, ఇండియా రక్షణచట్టం కింద ఒక వుత్తరువుచేసింది:

బ్రిటిష్ ఇండియా రక్షణకు, విజయ సాధనకు, ప్రజల జీవితానికి అవసరమైన సరుకులు సప్లయి చేయడానికి, ఇతర విధాల ప్రజలకు అవసరమైన విషయాల్లోను, పని చేస్తున్న కార్మికులందరికి, లేక ఆయా తరగతుల కార్మికులకు, వారిమీద ఆధారపడిన వారికి, కంట్రోలు ధరలకు యజమానులు ఆహారపదార్థాలు సప్లయిచేయాలని రక్షణ చట్టం 81 (2) (b,c) నిబంధనశాసిస్తుంది. కార్మికులు పనిచేసే ప్రదేశంలో వారు భోజనం చేయడానికి తగిన వసతికూడా యజమానులు ఏర్పాటుచేయాలి. యజమానులచేత ఈపనులు చేయించడానికి కేంద్రప్రభుత్వానికి, రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం ఈయబడింది.


రాజమండ్రి పేపరుమిల్లు మేనేజరు అక్రమ చర్యలు

లోగడ యజమానుల తగాదాలఫలితంగా రాజమండ్రి పేపరుమిల్లు ఆగిపోయింది. కాగితం సప్లయి ఎంతగానో కావలసిన ఈరోజులలో, మిల్లును నడిపించవలసినబాధ్యత ప్రజలమీద, ప్రభుత్వంమీదఉందని, కార్మికసంఘం ఆందోళనచేసింది. ప్రభుత్వంమిల్లునుస్వాధీనం చేసుకొని, పేపరు తయారుచేసేలా ఈ సంఘం కృషిచేసింది. ఫ్యాక్టరీని తిరిగి తెరిపించడానికి కార్మికుల ఈఆందోళన, కృషి, కొంత కారణము. కాని, అట్టి కార్మికులకు సౌకర్యాలు మాత్రములేవు. జీతములు తక్కువ. బోనసు లేదు, కరువుభత్యము సరిపోవుటలేదు. చౌకబియ్యము మిల్లు సప్లయిచేయుటలేదు. ఇన్ని యిబ్బంది లున్నప్పటికి, కాగితం ఎక్కువగా ఉత్పత్తి కావాలని కార్మికులు ఆందోళన చేస్తూనే ఉన్నారు. మిల్లు మేనేజరు సంకుచిత ధోరణిలో పోతున్నాడు. కార్మిక సంఘబలము తనచర్యలకు అడ్డుఅని, యూనియను ఉద్యోగులను పనినుంచి అక్రమంగా తొలగించి, కార్మికసంఘంపైని దెబ్బతీయ జూస్తున్నాడు. పేపరుమిల్లులో పేపరు ఉత్పత్తి కొరతకు కారణం మిల్లు మేనేజరు అవకతవకలే అని చెప్పాలి. తిరిగి, పేపరుమిల్లు ఉత్పత్తిని సక్రమపద్ధతులలోనడిపి, తీసివేసిన కార్మికులను పనిలోపెట్టి మిల్లు ఉత్పత్తిని వృద్ధిచేయాలని కంపెనీ డైరెక్టర్లకు, షేరు హోల్డర్లకు కార్మికసంఘం తెలియపరుస్తోంది.

రైల్వే కార్మికుల ఆందోళన

యం. యస్. యం. రైల్వేకార్మికసంఘం యొక్క రాజమండ్రిశాఖ ఈనెల 15వ తేదీని సభ జరిపింది. గుంతకల్లు సమావేశంలో జరిగిన తీర్మానాలను ఈసభ బలపరిచింది. రాజమండ్రి లోకోషెడ్డు రీఆర్గనైజేషన్ స్కీమును వెంటనే ఆచరణలో పెట్టాలనీ, రైల్వేబోర్డు నిర్ణయించిన కొత్తజీతాలస్కేలు రద్దుచేయాలనీ, తీర్మానించారు. ఇప్పుడు ట్రావెలింగు హమాలీలు ఐదుగురు మాత్రమే ఉన్నారు. పని చాలా ఎక్కువకావడం వల్ల, తగిన సౌకర్యాలు లేకపోవడంవల్ల, వీరి ఆరోగ్యం చెడుతూంది. కాబట్టి మరి ముగ్గురిని నియమించి, వీరికి పనివత్తిడి తగ్గించాలని, వారికి తగిన సౌకర్యాలేర్పాటు చేయాలనీ తీర్మానించారు. గ్యాంగుపనివారికి సెలవు కావాలంటే, సెక్షనల్ హెడ్‌క్వార్టర్సుకి వెళ్ళి అడగవలసిన అవసరం లేకుండా, గ్యాంగు మేస్త్రీలకే రికమెండుచేసే అధికారం ఇవ్వాలనికోరారు.

గుంతకల్లు బ్రాంచి కార్మికులు ఈ నెల 8 వ తేదీని సమావేశమయి స్టేషనుకు దక్షిణాన చాలాదూరంలోవున్న 2300 మంది కార్మికులకు కొత్తగా ఒక చౌకంగడి తెరవాలనీ, ఇప్పుడున్నఅంగడిదగ్గర తొక్కిసలాట తగ్గడంకోసం, రెండో కవుంటరు తెరవాలని తీర్మానించారు.



గుంతకల్లులో, యం. యస్. యం. రైల్వే కార్మికసంఘ 17 వ వార్షిక మహాసభ సందర్భంలో ఊరేగింపు

10 వేలమందికిమలేరియాప్రమాదం

కోవూరు తాలూకా (నెల్లూరుజిల్లా) లో పొన్నపూడి, రామతీర్థం, వరిణి, దండిగుంట, వూటుకూరు, గ్రామాల్లో 10 వేల మంది నివసిస్తున్నారు. ఇచ్చట 4 మాసాలనుండి మలేరియా ఉన్నది. రామతీర్థంలో ప్రతికుటుంబం ఈ వ్యాధికి లోనైనది. గంజికాచి పోసే దిక్కుకూడా లేదు. కొంతమంది చనిపోతున్నారు. ఇలా వున్నప్పటికీ హెల్తుడిపార్టుమెంటు కదలనంటుంది. క్వైనాకూడా కావలసినంత సప్లయిలేదు. ఈపరిస్థితులే జనవరి 15 వరకు వున్న, షుమారు 5 వేల ఎకరాల పైరు కోసే దిక్కులేక నిలువునా పొలాల్లోనే ఎండిపోతుంది. దీనివల్ల షుమారు 5 వేల పుట్ల ధాన్యం నష్టమవుతుంది. కాన పరిస్థితులు తీవ్రరూపం దాల్చకముందే వెంటనే ఈవ్యాధిని మాన్పాలి. ఎంతమందికి జ్వరం ఉండేది, ఎంత క్వైనా, తదితర మందులు కావలసిందీ వివరాలు రైతుసంఘ వర్కర్లు సేకరించి, హెల్తు డిపార్టుమెంటుకు, జిల్లా కలెక్టరుకు, పంపాలి.

మైలవరం ఫిర్కాలో వింతవ్యాధి

బెజవాడ తాలూకా మైలవరం ఫిర్కాలో ఒక వింతవ్యాధి చెలరేగుతూంది. మలేరియా లాగ జ్వరం వచ్చి ఒకటి రెండు రోజుల్లో రోగి చనిపోతున్నాడు. ఈవిధంగా అనంతవరం అనే గ్రామంలో 13 గ్గురు, కోడూరు అనే గ్రామంలో 15 గురు ఒకవారంరోజుల్లో చనిపోయారు. ప్రజలు చాలబెదిరిపోతున్నారు. రైతుసంఘం ఈ విషయంలో శక్తికొద్దీ పని చేస్తూంది. కాని, ప్రభుత్వం, తగిన వైద్య సౌకర్యాలతో వెంటనే పూనుకొనకపోతే, ఇంకా ఎక్కువ నష్టం తప్పదు.

మలేరియా మనకామ్రేడ్‌ని పొట్టబెట్టుకొంది

తూర్పు గోదావరిజిల్లా, కొత్తపేట తాలూకాలో, కె. పెదపూడి గ్రామంలోనివాడు కామ్రేడ్ యం. సూర్యారావు. చదువు, సాము లురాకపోయినా, ఆదర్శప్రాయమైన భక్తి విశ్వాసాలతో 1939 నుంచి పార్టీకార్యక్రమం కొనసాగిస్తూ వచ్చాడు. మలేరియాతో వారం రోజులు బాధపడి గతమాసం 30 వ తేదీ రాత్రి ఈ కామ్రేడ్ చనిపోయాడు.

"నాతమ్ముడు లేనికొరతను నేను తీర్చడానికి పాటుపడతాన"ని ముందుకువచ్చి, ఇతని అన్నపార్టీపట్ల తమకుటుంబంయొక్క భక్తిని చాటాడు.

కామ్రేడ్ సూర్యారావుకి మాజోహారులు.

నల్లగొండజిల్లా ఆంధ్రమహాసభ కార్యదర్శిపై కేసు

కొలనుపాక జాగీరుదారు దాదాపు పదివేల రూపాయిాల అక్రమపన్నును రైతులనుండి గుంజుతుండేవాడు. గతసంవత్సరం జాగీరులోని హిందూ ముస్లిం రైతులందరూ ఆంధ్రమహాసభ కృషిఫలితంగా ఏకమై ఈ పన్ను చెల్లించ నిరాకరించారు. దానిపై జాగీర్దారు అప్పటికి మూడువేలు తగ్గించి, మిగతాది రెండుమాసాల్లో పరిష్కరిస్తానన్నాడు. ఈ సంవత్సరం రైతులు తుది పరిష్కారాన్ని కోరారు. దీనికి జవాబుగ జాగీర్దారు రైతులను బెదరగొట్టటానికి పూనుకున్నాడు. రైతుసేవకుడైన నల్లగొండజిల్లా ఆంధ్రమహాసభ కార్యదర్శి శ్రీ ఆంట్ల రామచంద్రారెడ్డి గారిమీద, జాగీర్దారుకు పన్నులివ్వకూడదని, ప్రభుత్వానికి ధాన్యం ఇవ్వకూడదని ప్రచారం చేస్తున్నట్లు కేసు పెట్టబడింది. భువనగిరి కోర్టులో కేసు జరుగుతూంది.

సభలకు అనుమతికోరితే సైన్యంలో చేరమంటున్నాడు !

అధికారుల ప్రవర్తన ఒకొక్కప్పుడు అతి విచిత్రంగా ఉంటుంది. అనంతపురంలో, బెంగాలు క్షామనివారణనిధికి వసూలుకుగాను ఒక మీటింగు పెట్టుకోవాలని నిశ్చయించి, కలెక్టరు అనుమతి కోరారు స్థానిక కమ్యూనిస్టులు. దీనికి జవాబుగ పార్టీసభ్యులజాబితా ఇవ్వమని అధికారి కోరాడు. కామ్రేడ్సు జాబితాను ఇవ్వ నిరాకరించారు. ఆ జాబితాను ఇవ్వ నిరాకరించినవారితో తనకు సంబంధం లేదనీ, మీకొక పాలసీగాని, కార్యక్రమం గాని లేదనీ, అన్నాడా కలెక్టరు; యుద్ధంలో చేరమని సలహా ఇచ్చాడు. దేశాన్నంతటినీ ఆరాటపరుస్తున్న సమస్య, అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, బ్రిటన్, చైనా మొదలయిన దేశాల ప్రజల్నికూడా ఆందోళన కలిగించిన సమస్య బెంగాలు సమస్య. ఈ సమస్య విషయమై మీటింగు పెట్టుకోబోతే అనంతపూర్ కలెక్టరు పార్టీసభ్యుల జాబితా అడగడంలో అర్థం ఏమయినా ఉందా ?

అనంతపురంజిల్లా విద్యార్థి సంఘంవారు తమ వార్షిక సమావేశం జరుపుకోడానికి అనుమతిని కోరినప్పుడుకూడ ఈ అధికారి జిల్లావిద్యార్థి సంఘ సభ్యుల జాబితా (వారి వయసులతో సహా), వారికి సైన్యంలో చేరడం ఇష్టమో కాదో అన్న వివరాలతో పంపమని అడిగాడట. దేశరక్షణ నినాదంక్రింద, అన్నివర్గాల ప్రజల్ని సంఘటిత పరచగల సమావేశాలకు అనుమతి నడిగితే, అనవసర వివరాలను కోరడం, సైన్యంలో చేరమని ఒక విధంగా నిర్బంధించడం మిత్రరాజ్య నిర్వహణకు తోడ్పడడ మనుకుంటున్నాడు కాబోలు ఈ అధికారి, అదివట్టి భ్రమ.

కలకత్తాపై విమానదాడి అనుభవాలు

నృపేన్ చక్రవర్తి

[డిశెంబరు 5 వ తేదీ ఆదివారం కలకత్తాపై జపాన్ విమానాలు దాడిచేశాయి. పట్టపగలు ఆకస్మికంగా దాడిచేయడంవల్ల, జపాన్ దుండగీడులు ఎక్కువ నష్టాన్ని కలుగజేయగలిగారు. 500 కు పైగా గాయపడ్డారనీ, అందులో 300 కు పైగా మరణించారనీ, వార్తలు యిదివరకే ప్రభుత్వం ప్రకటించింది. ఈవ్యాసంలో అచట పనిజేసినవారి అనుభవాలు, ప్రజలు ఎలా ధైర్యంగా నిలబడ్డారో తెలుపబడింది.]

దాడి జరిగిన వెంటనే మేము వివరాలు తెలిసికొని, అవసరమైనచోట్లకువెళ్ళి ప్రజలకు సాయంచేయడానికి పార్టీ ఆఫీసుకు పరుగెత్తాము. దాడి జరిగిన ప్రదేశాలనుంచికూడా కామ్రేడ్స్ అచటికి వచ్చారు. కామ్రేడ్ అబనీ రిపోర్టు ఇస్తున్నాడు:

"దాడి హెచ్చరిక వినిపించినపుడు నేను డ్యూటీలోవున్నాను. దగ్గరవున్నవారినందరినీ కందకాలలోకి వెళ్ళమన్నాను. మొదట్లో నిజమైన దాడి అని వారు ఎంచకపోయినా, నా వత్తిడివల్ల వారు రక్షణస్థానాల్లోదాక్కున్నారు. బాంబులు దగ్గరగానే పడ్డాయి. కాని నేను వారికి, స్టాలిన్‌గ్రాడ్ ప్రజలు ఎలా ధైర్యంగా నిలబడ్డారో కథలుచెప్పి హుషారుచేశాను. కాని కందకాలలో దాక్కొనకుండా బయటవున్నవారు చాలమంది గాయపడ్డారు. నష్టపడినవారిలో హెచ్చుమంది కార్మికులు. వారికి యజమానులుగాని,అధికారులుగాని,చాలినన్ని విమానదాడి రక్షణలను నిర్మించలేదు."

తరువాత మేము నష్టపడిన ప్రాంతాలకు వెళ్ళాము. అచటనుంచి ఒకడజను కార్మిక కుటుంబాలు మూటాముల్లే సర్దుకొని వెళ్ళిపోడానికి సిద్ధమవుతున్నాయి. ఎందుకని అలా జరుగుతోంది? పాపం! వారు నివసించే గుడిసెలకు రక్షణలేదాయె! ఉద్యోగంభాయం కాదాయె! మేస్త్రీల పెత్తనంక్రింద బానిసత్వం అనుభవించుతున్నారాయె! పారిపోతున్నారంటే ఆశ్చర్యమేముంది?

బాంబులుపడ్డ ప్రదేశాలు

బాంబుల దెబ్బలకు ముఖ్యంగా గురియైన కార్మికపేటలకు వెళ్ళాము. ఇచట భూమి బీటలువారింది? టెలిగ్రాఫ్‌తీగలు తెగిపోయాయి. కొన్నియిండ్లు యింకా మండుతున్నాయి. మరణించినవారి శవాలు, పురుషుల, స్త్రీల, పిల్లల తునాతునకలైపోయిన శరీరాలు వెదజల్లబడివున్నాయి.

శవాలను వెంటనే తొలగించకుండా ఇలా వుంచడం ఏమి సబబు? అని నాలో నేను ప్రశ్నించుకొంటున్నాను. ఇంతలో ఒకరు "జపాన్‌వాళ్ళకు గురిచూడడమయినా చేతకాదు. మిలిటరీ స్థానాలను దెబ్బగొట్టలేక కార్మికులపైవేశారు", అన్నాడు. నేను అచట చేరిన ప్రజలను ఉద్దేశించి యిలా అన్నాను. "వారు చెప్పేది సరికాదు. జపానువాళ్లు కావాలనే బీభత్సం చేయడానికి కార్మికులపై బాంబులువేశారు. భయపెట్టి ఉత్పత్తి, రవాణాలు ఆగిపోయేటట్లు చేయడానికే వారిలా చేశార"ని చెప్పాను.

ఈ పేటలలో ఎవరూ భయపడి పారిపోలేదు. పొయిదగ్గిర కూర్చుని శాంతంగా వంటచేసికొంటున్న ఒక ముసలమ్మ యిలా అంది. "ఏ. ఆర్. పి. వాళ్లు. సంఘంబాబులు పారిపోగూడదని చెప్పారు. ఫ్యాక్టరీలో పనిచేస్తున్న మా అబ్బాయిలకు నేను వంటచేస్తున్నాను." పేటలను పరిశీలించుతున్న ప్రధాన మంత్రి నజీముద్దీనునుకలసికొని, కార్మికులకు రక్షణలను ఏర్పాటు చేయాలన్నాము. 'అది యజమానులపని' అని ఆయన జవాబిచ్చాడు. కార్మికులు తలదాచుకోడానికి గట్టి యిళ్ళు సప్లయిచేయాలని మళ్లీ హెచ్చరించాము. కాని అతడు జవాబివ్వకుండానే వెళ్లిపోయాడు.

దేశభక్తి అంటే

తరువాత కొందరు యజమానులను కలిసికొన్నాము. వారు కొన్ని దిట్టమైన యిళ్ళను కార్మికులకు ఇవ్వడానికి అంగీకరించారు. ఇంతటితో సంతృప్తిపడక మేము మ్యునిసిపల్ సభ్యుణ్ణికలసికొని, పాఠశాలను తాత్కాలికంగా కార్మికులు తలదాచుకోడాని కివ్వమని అడిగాము. ఆ హిందూమహాసభ సభ్యుడు మొదటనిరాకరించినా చివరకు ఒప్పుకొన్నాడు. కామ్రేడ్ రాధాశ్యామ్ తనయింటి క్రిందిభాగాన్ని రక్షణ ప్రదేశంగా యిచ్చాడు. అలా యివ్వమని యితరులలో ప్రచారం చేశాడు.

బర్మా పతనమయి, చిటగాంగుపై బాంబులు పడ్డాక కామ్రేడ్సును, ఏ. ఆర్. పి. లో చేర్పించింది పార్టీ. తక్కినవారిలో దేశభక్తిని రగుల్కొల్పి, క్లిష్టసమయంలో నిర్భయంగా పనిచేయడానికే యిలా చేసింది. ఈసారి దాడిలో ఏ.ఆర్.పి. దళాలు బాగాపనిచేశాయి. మంటలనుఆర్పడం, శిధిలాలలో చిక్కుకున్న వారిని రక్షించడం, గాయపడినవారికి చికిత్స చేయడం, చాల కష్టమైనపనే. ఐనా ఏ. ఆర్. పి. మెచ్చుకో దగిననట్లుగా పనిజేసింది.

మరునాడు

మరుచటిదినం కార్మికులు పనిలోకి వస్తారా? అనేది ముఖ్యమైన ప్రశ్న. నేను కలసికొన్న కార్మికులంతా "మేము పని వదలిపెట్టి పారిపోము. కాని మాకుసరియైన రక్షణస్థానాలుకావాలి."అన్నారు. కార్మికకామ్రేడ్సు వారిలో ఉత్సాహం, విశ్వాసాన్నికలిగించారు. పక్కవూళ్ళలోని కార్మికులు దాడిసమయంలో అడవిలోకి పోయి తలదాచుకొన్నారని మాకు చెప్పారు. ఒక ముసలి కార్మికుడు నన్నిలా ప్రశ్నించాడు. "ఎంతకాలం యీ బాధ పడతాము! రోజూ యిన్ని మైళ్ళు నడుస్తూనా? మాగ్రామాలకు పోదం మంచిదిగాదా?"

మాలో ఒకరిలా సమాధాన మిచ్చారు: "బర్మా పడిపోకపోతే కలకత్తాకు ప్రమాదముండేదికాదు. కలకత్తాను రక్షించితే బీహారులోవున్న మీ గ్రామాలు క్షేమంగావుంటాయి. ఇదివదలిపెడితే, జపాను దుండగీడులు మీ గ్రామాలపైనే దాడిచేయ గలుగుతారు." "అవును, బాబూ! ఇలా ఎంత దూరమని పారిపోతాము." అని కార్మికులు తమ అంగీకారాన్ని తెలిపారు.

పంచమాంగదళం గాలిమేడలు

విమానదాడి జరిగినందుకు పంచమాంగదళ ముఠా ముఖాలు, సంతోషంతో వికసించాయి. వారు ప్రజలను యిలా మోసపుచ్చుచూస్తున్నారు:"బ్రిటిషువాళ్ళుయిచటవున్నారు. కాబట్టి జపాన్ బాంబులువేసింది. వాళ్లుపోతే బాంబులు వేయదు. కొందరు కూలీలు చనిపోయారు. ఇంతేగా! మరి యిది యుద్ధం గదూ!" అని చెబుతూ ప్రజలలోరేగిన జపాన్ వ్యతిరేక భావాలను నిద్రపుచ్చుడానికి ప్రయత్నించుతున్నారు.

బోసు త్వరలో వస్తాడంటూ ఈ ముఠా పైలాపచ్చీస్‌గా గంతులువేస్తున్నారు. ఒకడు "బాంబులతో యిచట గందరగోళం బయలుదేరాక, బోసు గాలిగుమ్మటం వేసుకొని దిగుతాడు" అంటున్నాడు. వారి నాయకుడు — "బోసు సామాన్యుడు కాదు. ఇచట సర్వనాశనం అయాక, సైన్యంతో వస్తాడు" అని సెలవిచ్చాడు. అంటే అందుకోసం వాళ్ళు కాచుక్కూచున్నా రన్నమాట.

పై విషయాన్నిబట్టి ఒకటి తేలుతోంది. విమానదాడివల్ల దేశభక్తులలో కలిగిన కర్తవ్య తత్పరత; పంచమాంగదళంలో కలిగిన జపాన్‌వాళ్ళు వస్తారనే ఆశ, ద్యోతకమవుతోంది. కాని, పంచమాంగదళం, ఒక తప్పు అంచనావేసికొంటూంది. ఈసారి విమానదాడి మధ్యతరగతిలోగాని, కార్మికులలోగాని, భీతిని వ్యాపింప చేయలేకపోయింది. కలకత్తాలో గందరగోళం ఏమీలేదు. ప్రజా జీవితం, ఉత్పత్తి, సక్రమంగా నడచిపోతూంది. కాని యింతటితో ప్రమాదం తప్పిపోలేదు. జాతీయ ప్రభుత్వాన్ని స్థాపించి కరువును పారదోలడం, బర్మానుంచి జపానును పారదోలడం, జరిగినపుడే ప్రమాదం తప్పిపోవడమంటూ ఉంటుంది.

★ పుస్తకపరిచయం

"మధూదయము"

రచయిత: వట్టికొండ రంగయ్య.

76 పేజీలు; దొరుకుచోటు వెంకట్రామ అండ్ కో., తెనాలి.

వెల: రూపాయి

శ్రీ వట్టికొండ రంగయ్యగారు 1937 నుంచి, 40 వరకు రాసిన పద్యాలను కూర్చి ప్రచురించిన సంపుటి ఇది. ఇందులో 16 శీర్షికలున్నాయి. చక్కని ధారాశుద్ధి కలిగి ఉంది రంగయ్యగారికవిత్వం.

అయితే ఈ సంపుటిని ప్రచురించడంలో కవి ఆశయమేమిటి? అనే ప్రశ్నరాకమానదు. ఈ ప్రశ్నను ఎదుర్కొవలసిన బాధ్యత నేడు ప్రతికవి మీద ఉందికూడాను.

ఇందులో 'మధూదయమ'నే శీర్షికలోని ఒక పద్యాన్ని తీసి, కవి తన సంపుటికి తొలిపలుకుగా ముద్రించారు. అందులో "నేను మల్లికా సూనమనోజ్ఞ గుచ్ఛమయి....కవితా మధుసౌరభముల్ వెలార్చుచున్-గాన కళావిలోల రసిక భ్రమరాళికి విందు నే నెదన్," అనిఅంటారు. ఈ సంపుటిని ప్రచురించడంలో కవికి ఇంతకన్నా మరో ఆశయం ఉన్నట్టు కనబడదు. భావగాంభీర్యంకోసం, మహదాశయాలకోసం, ఈ సంపుటిలో వెతికితే ఆశాభంగం తప్పదు.

రంగయ్యగారి 'అభ్యుదయకవి' చదివినవారు, దానితరువాత ప్రచురణ అయిన 'మధూదయం'లో కవి అంతకన్నా అభ్యుదయ కరమయిన పోకడలు పోయి ఉంటారని ఆశించవచ్చు. కాని అలాంటిదేమీ జరగలేదు. పైగా, 'అభ్యుదయకవి'లో రచయిత ప్రకటించుకున్న మహదాశయాలకు పూర్తిగా వ్యతిరేకమైన ధోరణిలో సాగాయి, మధూదయంలోని కొన్ని రచనలు.

'ప్రజల అభ్యుదయంకోసం ఏమిటి రాశావ్?' అనేప్రశ్న కవి నెదుర్కొంటుంది. 'అభ్యుదయకవి'లో, ఏమీ లేదని తెలుసుకొని విచారిస్తాడు. 'ఛా! ఇక ప్రతి కావ్యంలోను, ప్రతిపద్యంలోను, ప్రతి గేయంలోను, ప్రజల నెదుర్కొని, పీడిస్తున్న సమస్యల పరిష్కారానికే కృషిచేస్తాను; భారత దాస్యవిమోచనానికి పాటుపడతాను,' అని శపథం చేస్తాడు కవి. కాని, దాని వెనువెంటనే తాను ప్రచురించిన 'మధూదయం'లో ఈశపథాన్నెంతవరకు నెరవేర్చాడు? విరహము, వియోగబాధ('ప్రవాసి; తపస్విని; భగ్నహృదయుడు) ప్రేమకలలు (వాంఛ), ముసలివాని కిచ్చి బలవంతంగా ముడిపెడుతున్న అమ్మాయి సౌందర్యం వృధా అయిపోతుందికదా అన్న ఆవేదన (కరుణగీతి), భవభూతికవిస్తోత్రము, మధుమాసవర్ణన—ఇలాంటి వాటితో నింపేశాడు ఈ సంపుటిని, కవి.

అంతేకాదు, 'అభ్యుదయకవి'లో—'అఖిల దేశ ప్రజావళి ఏకముగ నొకవైపు నిల్చెను—చేరి రింకొక పక్షమున ఫాసిస్టులందరును'— అని అంటాడు. ఫాసిస్టు పక్షంలో జపాను కూడా చేరిందంటాడు. అజపానుకు గులామై, మాతృద్రోహానికి వడికట్టిన బోసుకి-ఏనాడో తాను సమర్పించుకొన్న స్వాగతపత్రాన్ని కూడా ఈ సంపుటిలో ప్రచురించారు రంగయ్యగారు. అంటే ఏమిటి? ఈ 'స్వాగతం' రాసిన రచయిత 'అభ్యుదయ కవి'గా ఒకడుగు ముందుకు వేశాడా? లేక 'అభ్యుదయకవి' రచయిత 'మధూదయం'లోకి ఒకడుగు వెనక్కి వేశాడా? స్వాగతంకింద దానిని రాసిననాటి తేదీ (1939 సెప్టెంబరు) కూడా వేశారు. పై సందేహాన్ని ఈ తేదీ తీరుస్తుందని కవి అనుకుంటాడేమో? అదివట్టి భ్రమ. తాను వెనకరాసినవాటిని తిరిగి ప్రచురించుకోవాలనే ఉబలాటంలో పడి కొట్టుకుపోయి,కవి తనఆశయాన్నే మరచిపోయాడు.

'అభ్యుదయకవి'లో—'కవి వతంసులు నవ్యరీతుల కావ్యమాలికలల్లి, ప్రజల్లో నూత్నావేశ ముత్తేజమ్ము నుద్దీపింపజేయవలెన్',అని రంగయ్య ఉద్ఘోషించారు. అభ్యుదయకవిత్వానికి ఇతరకవులను మేలుకొల్పాలన్నారు. 'మధూదయం'లో కూడా 'వీడుకోలు' అనేకావ్యంలో 'మాతృవిమోచనార్థమై అనువగు బోధగీతికల నల్లుటకై' ప్రయత్నిస్తానని తాను కాలేజీ విడిచి వస్తున్నప్పుడు రాశారు. కాని, మధూదయంలోని 'కవీ' అనే రచనలోని భావాలేమిటి? 'నిన్ను వెర్రివాడవని ఇతరులు అనుకుంటే అనుకోనీ. విచారించకు. నువ్వుపట్టింది బంగారంచేయగల సమర్థుడవు. నీ కవిత్వాన్ని మెచ్చి పసిడికానుకలివ్వగల భోజుడు, కృష్ణరాయలు లేరని విచారించకు. భావనతోకూడుకున్న చక్కని కవిత్వాన్ని పండితోత్తములు మెచ్చుకొంటార'ని కవిని బుజ్జగిస్తాడు. అంటే పండితులకోసం రాయి అని కవులను పురికొల్పడమేకదా?

ఒక మహదాశయాన్ని ప్రకటించిన తరువాత, దానికి భిన్నంగా ఉండే తొలిరచనలను ఇపుడు ప్రకటించడంలో అర్థంఏమిటి?

'అభ్యుదయ కవి'లో—'గతము గతమే తిరిగి రాదిక - భావి కర్తవ్యమ్మునికపై భావనము సేతున్ - ఇప్పుడే నే కనులు తెరచితి, తప్పులన్నియు దిద్దుకొందును'—అని అన్నారు రంగయ్యగారు. కాని, 'మధూదయాన్ని' చూస్తే తప్పులు దిద్దుకొన్నట్లు కనబడదు.

తరచిచూస్తే 'మధూదయం' ఒక ఉద్దేశంలేని గ్రంథంగాకనబడుతూంది. సాధనకోసం తొలిరోజుల్లో అల్లిన కవిత్వాన్నంతా కూర్చి పాఠకలోకంపై విసిరారు రంగయ్యగారు. ఈ ప్రయత్నంలో రంగయ్యగారు ఒక ముఖ్య విషయాన్ని మరచిపోయారు. ఇంతకుముందే ప్రచురించిన గ్రంథంలో, తాను ఒక గొప్ప ఆశయాన్నిప్రకటించుకున్నారు. ఇప్పుడుతాను సేకరించిన రచనలు దానికి విరుద్ధమయినవన్న సంగతిని మరచిపోయారు. ఏ రచనలనయితే వ్యర్థమయినవిగ 'అభ్యుదయకవి'లో ఖండించారో, అలాంటి తన తొలిరచనలనే ఇందులో సేకరించారు. 'అభ్యుదయకవి' దృష్టిలోనే ఈ గ్రంథం వ్యర్థమయినది.

ఆహారపదార్థాల కంట్రోలు

బెంగాలులో ఇండియారక్షణ చట్టంక్రింద రేషనింగు - సింధుప్రభుత్వపు కీచులాట

మద్దుకూరి చంద్రశేఖరరావు

యుద్ధం ఆరంభమయి నాలుగు సంవత్సరాలు దాటిపోయింది. యుద్ధంలో పాల్గొంటున్న స్వతంత్రదేశాలు, ఆరంభంనుంచీ జీవితావసరవస్తువులధరలను కంట్రోలుచేసి, రేషనింగు అమలుజరుపుతున్నాయి. తద్వారా జీవితావసరాలు ప్రజలందరికి సరిగ్గా పంపకం చేయడానికి, ఆయాదేశ ప్రభుత్వాలు బాధ్యత వహించి పనిజేస్తున్నాయి. ఉదాహరణకు జాతీయప్రభుత్వమున్న ఇంగ్లండులో, ఏ అవసర వస్తువు ఖరీదు యుద్ధానికి పూర్వంకంటే నూటికి 30 పాళ్లకంటే హెచ్చులేదు. ఇందువలన జీవితావసరాలు ప్రజలందరికీ అందుబాటులో వున్నాయి. ఏదైనాకొరతవున్న వస్తువు సైతం రేషనింగుద్వారా ప్రజలందరికి పంచడంవల్ల కొందరికి పూర్తిగా లేకపోవడమనే సమస్యే రావడంలేదు.

కాని భారతదేశంలో పంచదార, కిరొసిన్ వంటి ఏవో కొలదివాటిని మినహాయిస్తే, జీవితావసరాలైన వస్తువులనన్నిటిపైన నిజమైన కంట్రోలు లేనేలేదు.

అన్నిటికంటే ప్రజలకు జీవనాధారమైన ఆహారపదార్థాల ధరలు గందరగోళంగావున్నాయి. ఒకచోట ఉన్న ఖరీదుకు, మరొకచోట ఉన్న దానికి సంబంధమేలేదు ప్రభుత్వరేటుకు, ప్రజలకు అందేరేటుకు సంబంధంలేదు. పండించే రైతు అమ్మేరేటుకు, వినియోగించే ప్రజలకు దొరకే రేటుకు, విపరీతమైన తేడా వుంటూంది. ఈవిధంగా దేశంలో మణుగు 1 కి 8 రూపాయలనుంచి 100 రూపాయల వరకు బియ్యం ఖరీదువుంటూంది. ప్రభుత్వం కంట్రోలు చేయకపోవడం, నిల్వ వ్యాపారస్తులు సరుకును దాచి విపరీతమైన లాభాలను గుంజడంవల్ల మధ్య ప్రజాసామాన్యం నలిగిపోతూంది. కరువు దేశంలో తాండవమాడుతోంది.

ఇండియాప్రభుత్వం కాంగ్రెసు నాయకులను అరెస్టుజేసి రాజకీయ ప్రతిష్టంభనను తెచ్చిపెట్టడంతో ఆర్థిక సంక్షోభానికి రాజకీయ సంక్షోభం అగ్నికి-గాలి తోడయినట్లే తోడయింది. కొత్తవైస్రాయి వేవెల్‌వచ్చాక ఆహార సంక్షోభాన్ని తొలగించడానికి, ధరల కంట్రోలు-రేషనింగ్ అమలు జరుపడానికి, ప్రయత్నించుతున్నాడు-బెంగాలులో మిలిటరీ సహాయంతో ఆహారపదార్థాలను రవాణాచేయడానికి, పంచడానికిపూనుకొన్నాడు. ఇండియా అంతటా ఆహారపదార్థాల కంట్రోలు, రేషనింగు అమలు జరుపడానికి సన్నాహాలు చేస్తున్నాడు.

బెంగాల్ రభస

బెంగాలులో లక్షలకొలది ప్రజలు కరువువల్ల చనిపోయారు. కాని అచటి లీగ్ మంత్రివర్గం యింతవరకు ధరల కంట్రోలు చేయలేదు. ముస్లింవర్తకులకు, బ్రిటిష్ వర్తకులకు, బెంగాల్ మంత్రివర్గం లొంగిపోయింది. తిండిదొంగలగు నిల్వవ్యాపారస్థులు ఆక్టోబరులో వచ్చిన ఆవుస్‌పంటను కొనివేసి దాచారు. తత్ఫలితమే బెంగాల్ కరువు. ఈఅనుభవాన్నుంచైనా బెంగాల్ మంత్రివర్గం గుణపాఠం నేర్చుకోలేదు. డింసెంబరులోవచ్చిన అమన్‌పంటకు సైతం యింతవరకు ధరలు నిర్ణయించలేదు. ఇదికూడ నిల్వవ్యాపారస్థుల చేతుల్లోకి పోయే ప్రమాదంవుంది. పండించిన రైతులనుండి స్వల్పఖరీదులకు తిండిదొంగలు కొనివేస్తున్నారు.

ఈ పరిస్థితులలో ఇండియాప్రభుత్వం జనవరిలో ఆహారసభను జరుపుతోంది. కరువు యింత తీవ్రంగావున్నా,బెంగాలులో, కలకత్తా వంటి పట్టణాలలో సైతం ఇంతవరకు రేషనింగులేదంటే ఎంతసిగ్గుచేటో చెప్పండి. పాతవైస్రాయి, ఇండియా మంత్రి తలలు యినుకలోదూర్చి మాకేమీ సంబంధంలేదు, బెంగాలులో మంత్రివర్గముందని తప్పుకోడానికి ప్రయత్నించారు. కాని, దీనిని ప్రజలెవరు నమ్మలేదు. అందుచేతనే బ్రిటిషు ప్రజలు వాళ్ళను దుయ్యబట్టారు. కొత్తవైస్రాయి వేవెలు ఎట్టకేలకు రేషనింగు జనవరినుండి అమలుజరపాలని బెంగాల్ ప్రభుత్వానికి తెలియజేసినట్లు వార్తలు వస్తున్నాయి.

బెంగాలు మంత్రివర్గం, ముస్లింలీగు నాయకత్వం యికనైనా మేల్కొవాలి. క్షామనివారణకు ప్రజాప్రతినిధులైన తాము చొరవతో కంట్రోలు - రేషనింగు అమలుజరుపలేదు. దీని ఫలితమేమిటి? ఇండియాప్రభుత్వం - వైస్రాయి జోక్యం కలుగజేసికోవలసివస్తూంది. ఆకలితో మాడుతున్న సామాన్య బెంగాల్ ప్రజలు ఏమనుకొంటారు? తాము ఎన్నుకొని పంపించిన మంత్రులే తమకు అందుబాటులో వుండునట్లుగా ఆహారం ధరలు కంట్రోలు చేయడంలేదు. ప్రజలలో యిది నిస్పృహను కలుగజేస్తుంది. క్రమంగా మంత్రివర్గంపై విశ్వాసం సన్నగిలుతుంది. ఈ విధంగా లీగ్ మంత్రివర్గం అవలంబించుతున్న వినాశకరమైన పాలసీవల్ల, తిండిదొంగలకు లొంగిపోవడంవల్ల, ప్రజాభిమానాన్ని కోల్పోతుందనేసంగతి ముస్లింలీగ్ నాయకత్వం ఎంతత్వరలో గ్రహించితే అంత మంచిది. ఈ ప్రమాదాన్ని తప్పుకోడానికి ఒకటే మార్గముంది. ఇతరపార్టీలు, ప్రజల సహకారంతో ధరల కంట్రోలు, రేషనింగు అమలుజరిపి బెంగాలుప్రజలను క్షామన్నుంచి కాపాడాలి.

పంజాబు - సింధుమంత్రుల కీచులాట

బెంగాలు కరువుతోవుంటే,పంజాబు-సింధు రాష్ట్రాలు అదనపు పంటలున్న ప్రాంతాలు. అచటపండే బియ్యం-గోధుమలు రాష్ట్రప్రజల అవసరాలకు సరిపోగా ఎగుమతి చేయడానికి మిగులుతాయి. ఈ రాష్ట్రాలలో కూడ ముస్లిం లీగ్ మంత్రివర్గాలు అధికారంలో వున్నాయి. సరియైన ప్లాను వేసికొని, ముస్లింలీగు నాయకత్వం తన మంత్రివర్గాలద్వారా పనిచేయించితే, బెంగాల్ కరువు పరిష్కారంలో తోడ్పడగలిగేది. అదేవిధంగా భారత రాజకీయాలలో కాంగ్రెసుతరువాత ముఖ్యపాత్ర వహించుతున్న ముస్లింలీగ్ తన ప్రజానాయకత్వాన్ని దిట్టపరుచుకొనేది. కాని దురదృష్టవశాత్తు అదేదీ జరగడం లేదు.

పంజాబు మంత్రివర్గం పంజాబు జమీందారుల, నిల్వవ్యాపారస్తుల, ప్రయోజనాలను దృష్టిలోపెట్టుకొని ధరలకంట్రోలును వ్యతిరేకించింది. అదేవిధంగా సింధు మంత్రివర్గం కూడ కేంద్రప్రభుత్వపుధరల కంట్రోలు స్కీమును వ్యతిరేకించుతోంది. సింధుప్రధాని సర్ గులాంహుస్సేన్ హిదయతుల్లా ధరలనుపెంచే అధికారం తమకు లేకుండాచేశారని ఇండియా ప్రభుత్వాన్నినిందించుతూ ఒకప్రకటనచేశాడు. ఇదివరకు సింధులో బియ్యంధర మణుగు 1 కి 9 రూపాయలు, గోధుమ ధర 7 రూపాయలు వుండేది. బెంగాల్‌వగైరా కరువు ప్రాంతాలకు ఎగుమతులకు సింధుప్రభుత్వం మణుగు 1 కి బియ్యానికి 16 రూ. గోధుమలకు 13 రూ. వసూలుచేస్తోంది. ఈరెండు ఖరీదులకువున్న తేడాను సింధుమంత్రివర్గం డెవలప్‌మెంటు ఫండుకు జమకట్టుకుంటోంది. శాసన సభ్యులలో అధిక సంఖ్యాకులుగావున్న జమీందారులు ధరలు ఎక్కువచేయాలనికోరారుకాబట్టి తాము వ్యవసాయదారువద్ద కొంటున్న ఖరీదును 9రూ. నుంచి 12 రూ. లకు హెచ్చించదలచామని మంత్రివర్గంప్రకటించింది. ఇండియాప్రభుత్వం జనవరిలో జరిగే ధరలకంట్రోలుసభ ఖరీదులను నిర్ణయించేవరకూ ఏవిధమైన మార్పులు చేయరాదని సింధుమంత్రివర్గానికిసూచించింది.

ఇందుకు సింధు మంత్రివర్గం తమ అధికారాన్ని కించపరచినట్లు సవాలుచేస్తోంది. తాము వ్యవసాయదారులకు, అనగా జమీందారులకు, న్యాయమైన ఖరీదు ఇవ్వదలిస్తే, ఇండియా ప్రభుత్వం అడ్డుతగులుతోందని మంత్రులు ఆక్షేపించుతున్నారు. పోనీ తాము డెవలప్‌ఫండుకు మినహాయించుకోడం మానివేసి మ 1 కి 12 రూ॥ చొప్పున రాష్ట్రంలోనూ, ఎగుమతులకుకూడ ఒకే ఖరీదులో సప్లయిచేస్తా మంటున్నారు. దాని తాత్పర్యమేమంటే, సింధు జమీందారులు అమ్మే బియ్యం మణుగు 1 కి 9 నుండి 12 రూ.లకు ఖరీదుహెచ్చించాలన్నమాట. అందుకుఅంగీకరించితే పంజాబునుండి కరువు ప్రాంతాలకు 16 రూ॥కు సప్లయి అవుతూంటే తాము అంతకంటే తక్కువగా అనగా 12 రూ॥కు అయినా సప్లయిచేస్తామని సింధుమంత్రులు సవాలు చేస్తున్నారు.

అసలు సమస్యను పరిశీలించితే పంజాబు, సింధు, మంత్రివర్గాలు తప్పుచేశాయి. అటు బెంగాలులో లక్షలకొలదీ ప్రజలు చస్తూంటే, యీ ఆకలిమంటలను అదనుగా లాభం పొందచూస్తున్నాయి, పంజాబు మంత్రివర్గం కేవలం జమీందార్ల, నిల్వవ్యాపారస్తుల దురాశకు లొంగిపోయి బెంగాలుకు ఎగుమతి చేస్తూన్న బియ్యానికి మణుగు 1కి 16 రూ. వసూలుచేసింది. ఆ విధంగా వారు కరువునుండికూడా లాభాలనుపొందే నైచ్యానికి లోబడ్డారు. సింధుమంత్రివర్గం ఇంకోవిధంగా చేసింది. తమ రాష్ట్రంలో మణుగు 1 కి 9 రూ॥ వుంటే ఎగుమతులకు పంజాబువలెనే 16 రూ॥ వసూలుచేసింది. వచ్చిన లాభాన్ని రాష్ట్రీ డెవలప్‌మెంటు ఫండుకు జమకట్టింది. రాష్ట్రాభివృద్ధికి నిధిని పోగుచేయాలనే ఆశయమున్నా, యిదికూడ రాష్ట్రీ దురభిమానమే అనిపించుకొంటుంది. ఏమంటే, ఒకవైపున సోదరప్రజలు బెంగాలులో మాడుతూంటే, యీ విధంగా లాభాలు గుంజడం సబబు కాదుగదా!

ఈ లాభాలు గుంజడాన్ని, బ్రిటిషు ప్రభుత్వం ప్రకటించిన 'వైట్‌పేపరు' తీవ్రంగా ఖండించింది. అంతేగాక వేవెల్ వచ్చాక యిలాంటి ఒడిదుడుకులను సర్దడానికి, భారతదేశానికంతటికీ ధరలనుకంట్రోలు చేస్తామని ఇండియా ప్రభుత్వం ప్రకటించింది. సింధు జమీందారులు తమవద్ద కొంటున్న బియ్యం ధరను 9 రూ. నుంచి 12 రూ. లకు హెచ్చించాలని ఆందోళన ప్రారంభించారు. సింధు మంత్రివర్గం వారికి లొంగిపోయింది. ఇండియా ప్రభుత్వం తాము ఖరీదులను నిర్ణయించేలోగా పెంచడానికి వీల్లేదని తెలిపింది. దీనికి వ్యతిరేకంగానే సింధుమంత్రులు చేస్తున్న హడావుడీ అంతా.

లీగ్‌నాయకుల కర్తవ్యం

ప్రజలకు, క్షామనివారణ కార్యక్రమానికీ, విరుద్ధమైన ఈ పాలసీని అఖిలభారత ముస్లింలీగునాయకత్వంకూడ బలపరుస్తూంది. ఇండియాప్రభుత్వం యిలా రాష్ట్రప్రభుత్వాలలో జోక్యం కల్గించుకోవడం తప్పని వారివాదన. అంతేగాక అన్ని వస్తువులకు కంట్రోలు లేనిదే ఆహారపదార్థాలకు మాత్రం ఎందుకని వితండవాదనకూడ తెస్తున్నారు. ఇది ప్రజల క్షేమం కోరేవారు చేయాలసినదికాదు. జమీందారుల, నిల్వ వ్యాపారస్తుల ప్రయోజనాలను మాత్రమే యిది తెలుపుతుంది. అన్నివస్తువుల ధరలను కంట్రోలు చేయవలసిందే! కాని అన్నిటికంటే ముఖ్యమైనది ఆహారం కాదా? ఆహారపదార్థాలను కంట్రోలుచేసి, రేషనింగు అమలుజరపడంలో సాయంచేయడం ప్రజాక్షేమం కోరేవారందరి విధి. దానితోపాటు ఇతర అవసరవస్తువుల కంట్రోలు కొరకు, వ్యవసాయదారులకు అవసరమైన పనిముట్ల ధరలకంట్రోలు కొరకు, ఆందోళన చేయవచ్చును. అంతేగాని ఆహారకంట్రోలుకు వ్యతిరేకంగా, ఇతరవస్తువుల కంట్రోలు లేదని ఎత్తిచూపడం నిజంగా వితండవాదమే.

పంజాబు సింధు మంత్రివర్గాలు తమ పాలసీవల్ల ప్రజలకు విరుద్ధమైన మార్గాన పడుతున్నారు. లీగ్‌నాయకత్వంకూడ వారిని సరిదిద్దలేకపోవడమే గాకుండా అతప్పుడు పంథానే బలపరుస్తూంది. ఈ పొరపాటును లీగునాయకత్వం దిద్దుకోవాలి. వైస్రాయి ఆహారకంట్రోలు ప్లానును అమలు జరుపడం ద్వారా, లీగు మంత్రివర్గాలను దెబ్బ కొట్ట కలుగుతాడు. లేక ప్లాను అమలు జరుగకపోయినా, దేశాన్ని క్షామం మరింత ఆహుతి చేస్తుంది. ఆవిధంగాకూడ లీగు నాయకత్వం దెబ్బతింటుంది. ఈ పరిస్థితులనుండి విమోచనకు ఒకటేమార్గముంది. లీగునాయకత్వం తమ మంత్రివర్గాలు ఆహారపదార్థాల కంట్రోలు, రేషనింగు అమలు జరుపడంలో చొరవ తీసికొనేటట్లు చేయాలి. కరువునివారణకు తోడ్పడుతూ, ఇతర జీవితావసరాల కంట్రోలుకు ఆందోళన చేయాలి. లేనిచో అధికార వర్గం చేతిలో పట్టీ తింటుంది; ప్రజలకు దూరమవుతుంది.

పల్నాడుక్షామ నివారణ కమిటీ స్థాపన

గత మూడు సంవత్సరాలనుండి పల్నాడు తాలూకాలో పంటలు సరిగాలేవు. ఈ ఏడు కూడా పంటలుబాగులేవు. పైగా వరిగ, కంది, మొదలైనవాటికి తెగుళ్ళు, పురుగులు వ్యాపించాయి. కరువు పరిస్థితులు ప్రమాదకరంగా పరిణమించే సూచనలున్నాయి. ఈపరిస్థితుల నెదుర్కొని, తగిన నివారణ ఏర్పాట్లకు ఆందోళన చేయడంకోసం, జనవరి రెండవతేదీని గురజాలలో సమావేశం జరిపి 'తాలూకాక్షామ నివారణ కమిటీ'ని ఏర్పర్చడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

★

అరెస్టులు - విడుదలలు

బొకు ప్రాజెక్టు (కర్నూలుజిల్లా) వద్ద కూలీలను సమ్మెకు రెచ్చగొట్టారనే నేరంపైని కామ్రేడ్ వెనిగళ్ళ సోమేశ్వరరావు, వాసిరెడ్డి బాపయ్యలను జూలై 22 వ తేదీని అరెస్టుచేశారు. కర్నూలు అడిషనల్ ఫస్టు క్లాసు మేజిస్ట్రేటు విచారించి, రుజువుకాలేదని ఈనెల 15 వ తేదీని కేసును కొట్టివేశారు.

* * *

కామ్రేడ్ రామిశెట్టి వేణుగోపాలరావుపై, యుద్ధబాండ్లు కొనవద్దంటున్నాడనే నేరంమోపి తిరువూరు తహసీల్దారు ఈనెల 20 వ తేదీని అరెస్టు చేయించారు.

★

ఏలూరు జ్యూట్ కార్మికుల విజయం

జ్యూట్‌మిల్లుయజమాని, కార్మికులవద్దనుంచి ఐదురూపాయలనుంచి పదివరకు హామీగా తీసుకొన్నాడు.

అక్రమంగా కార్మికులదగ్గరనుంచి యిట్టి హామీ తీసుకోరాదని ఎన్నిసార్లు కార్మికులు చెప్పినా యజమాని మానలేదు. పట్టణ ట్రేడ్ యూనియన్ కౌన్సిలు ఫ్యాక్టరీ యిన్‌స్పెక్టరుకు యీఅక్రమవసూళ్ళను గురించి తెలియపరచి, జ్యూటు అధికోత్పత్తికి యజమాని కలిగించే ఆటంకాలనుకూడా వివరించింది. ఫ్యాక్టరీ యిన్‌స్పెక్టరు విచారణచేసి, యీ వసూళ్ళను మానివెయ్యాలని, కార్మికులవద్ద నుంచి తీసుకొన్న డిపాజిటు సొమ్ము తిరిగి యిచ్చివెయ్యాలని, నిర్ణయించారు. ఏలూరు జ్యూటు కార్మికులు తమ సంఘబలంతో ఈ విజయాన్ని సాధించారు.

దేశభక్తులలో దేశపరిస్థితులే మార్పు తీసుకొస్తున్నాయి

వాసిలిఫిర్కా (నెల్లూరుజిల్లా) రైతు మహాసభకు యేర్పాట్లన్నీ పూర్తిఅయాయి. వేలకొద్దీ రైతుల్ని సమీకరించడానికి ప్రతి గ్రామంలోను రైతువర్కర్లు, కమ్యూనిస్టులు, విరివిగా ప్రచారంచేశారు. ఈ మధ్య వర్షాల వల్ల చెరువుకట్టలుతెగి, పంట నష్టమైనప్పుడు, రెమిషన్‌కొరకు ఆందోళన చేసింది యీ ప్రాంతంలోనే. కూలిపోయిన యిండ్లకు సహాయం చేయవలసినదిగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చిందీ యీ ప్రాంతంలోనే. తెగినచెరువులకు స్వయంగా మరమ్మతు చేసుకొని, కొంతవరకైనా పంటనుకాపాడుకో గలిగినదికూడా యీ ప్రాంతంలోనే. కరువు నుండి కాపాడుకోడానికి రైతులు అధికాహారోత్పత్తికై యెలా ముందుకురావాలో ప్రచారం కూడా యీ ప్రాతంలోనే విరివిగా జరిగింది.

ఫిర్కా అంతటికీ అది పెద్ద గ్రామం. ఆ గ్రామంలో జైలుకువెళ్ళివచ్చిన కాంగ్రెసు దేశభక్తులున్నారు. వారిని కమ్యూనిస్టులతో కలియకుండా పెడమార్గాలలో నడిపించడానికి విచ్ఛిన్నకారులు కొందరు ప్రయత్నిస్తున్నారు. వారు కాంగ్రెసు బురఖా తగిలించుకొని, గాంధీజీపేరుతో ప్రజా ఐక్యతను చీల్చడానికి కృషిచేస్తున్నారు. ఎలాగైనా ఫిర్కా రైతు మహాసభ జరగకుండాచేయాలని వారి ప్రయత్నం. ఆ ప్రాంతాలలో రంగయ్యగారు ప్రముఖ కాంగ్రెసువాది. ఈ మధ్యనే జైలు నుండి విడుదలఅయి, తిరిగి వచ్చారు. వచ్చీ రాగానే విచ్ఛిన్నకారులు ఆయనవద్దకువెళ్ళి, కమ్యూనిస్టులకు వ్యతిరేకంగాను, ప్రజాసంస్థలకు వ్యతిరేకంగాను, బోధించసాగారు. కమ్యూనిస్టులుకూడా తమ కార్యక్రమాన్ని గురించి వారితో చర్చించారు. విచ్ఛిన్నకుల కార్యక్రమం కాంగ్రెసు కార్యక్రమంకాదని ఆయన తెలుసుకున్నప్పటికీ, కమ్యూనిస్టులతో కలిసి పనిచేస్తే, కాంగ్రెసుబురఖాతో తిరుగుతూన్న విచ్ఛిన్నకారు లేమంటారో; జైల్లో ఉన్న నాయకులు బయటికివస్తే వారు ఏమంటారో; అనే అనుమానం పీడించింది రంగయ్యగారిని. కాని, నానాటికీ దేశవ్యాపితమౌతూన్న కరువు రాక్షసికి ప్రజలు ఆహుతి అవుతూంటే, చూస్తూ ఊరుకోడానికి ఆయన మనసొప్పలేదు. ఏదో విధంగా ప్రజలకు సహాయంచేసి తీరాలనీ, అది తన కర్తవ్యమనీ, విశ్వసించాడు.

మనసులో ఆరాటం

మహాసభ ఆనాటిసాయంత్రం జరుగుతుందని ప్రకటించారు. ఉదయం 8 గంటలైనా కాకముందే, ఒక్కొక్కగ్రామంనుంచీ రైతులు బారులుతీరి వస్తున్నారు. "దేశరక్షణకూ, జాతిరక్షణకూ, కాంగ్రెసునాయకుల్ని విడుదల చేయాలి!", "జాతీయప్రభుత్వంకావాలి!" మొదలయిన నినాదాలతో ఊరేగింపులు వస్తున్నాయి. బాలసంఘంపిల్లలు "గాంధీతాతయ్య పుట్టినదేశం" అనిపాడుకుంటూ చకచక నడిచి వెళ్తూంటే, మన రంగయ్య వరండాలో కూర్చొని, సిగ్గుతో తలవంచుకొని, ఆలోచించసాగారు. "కాంగ్రెసునాయకులు జైళ్లలో ఉన్నప్పుడు, బయటి కాంగ్రెసువాదుల కర్తవ్యం ఏమిటి? శక్తివంచనలేకుండా ప్రజలకు సహాయం చేయవద్దా? చేతులు ముడుచుకొని కూచోడం కాంగ్రెసువాదియొక్క లక్షణమేనా? కమ్యూనిస్టులతో కలిసి పనిచేయడం వల్ల తప్పేమిటి?" అనేఆలోచనలు రంగయ్య మనస్సును కలచివేస్తున్నాయి.

కమ్యూనిస్టులతో సంభాషణ

ఇంతలో ఇద్దరు కమ్యూనిస్టులు రంగయ్య ఇంటి కొచ్చారు. సాయంత్రం బహిరంగ సభకు అధ్యక్షత వహించవలసిందని కోరారు. రంగయ్య పాపం కంగారుపడ్డారు. "నేనెందుకులెండి! అలాంటిబాధ్యతను నేను నిర్వహించలేను." అని జవాబిచ్చారు. దేశభక్తులంతా యిలాంటి కార్యక్రమంలో పాల్గొని, ప్రజలకు నాయకత్వం వహించాలని కమ్యూనిస్టులు హెచ్చరించారు. "కాంగ్రెసువాదులమైన మేము ఒక నిర్ణయానికి రానిదే, మీతో కలిసి పనిచేయడం బాగుండద"ని ఆయన అనుమానిస్తూ చెప్పారు. వర్కింగ్‌కమిటీ సభ్యులైన సరోజినీదేవి ప్రకటనను కమ్యూనిస్టులు ఉదహరించారు. రంగయ్య, "ఔను నిజమే. కాని, ఆప్రకటనకు తలొకవిధంగా అర్థం చెబుతున్నారుగదా! 'జమీన్‌రైతు' పత్రిక చూదామాఅంటే, కాంగ్రెసుకు వ్యతిరేకమైన కార్యక్రమాన్ని ప్రచారం చేస్తోంది. 'ములుకోల' పత్రికవిషయం చెప్పనవసరమే లేదు. వట్టి బూతులపంచాంగం. ఈరెండు పత్రికలూ పుచ్చుకొని, కొందరు కాంగ్రెసువాదులే ప్రచారంచేస్తున్నారు. ఇక, మీపార్టీని చూద్దామా అంటే, ప్రతివారినీ పంచమాంగదళం అని నిందిస్తారు. ఇదంతాచూస్తే, మళ్లీ జైలుకు వెళ్ళడమే మంచిదనిపిస్తోంది!" అని రంగయ్య నిస్పృహతో కుంగిపోయారు. కమ్యూనిస్టులు తమకార్యక్రమాన్ని వివరంగా తెలియజేశారు. కాంగ్రెసువాదుల్ని పంచమాంగదళం అని దూషించడం పార్టీపంథా కాదన్నారు. కాంగ్రెసు బురఖాతో, కాంగ్రెసుకు వ్యతిరేకమైన కార్యక్రమాన్ని ప్రచారం చేస్తూ, దేశంలో అరాజకం-అల్లకల్లోలం తీసుకొచ్చి, జపాన్ దుండగీడులకు సహాయం చేసేపనులలో నిమగ్నమైనవారే పంచమాంగదళమని నిరూపించారు. "ఐతే, ఈయుద్ధం ప్రజాయుద్ధమంటారు మీపార్టీవారు. అందుకు నేనంగీకరించను. "పోరాట" కార్యక్రమాన్ని మీరు మొదటినుంచీ వ్యతిరేకించారు. కాంగ్రెసు తీర్మానాన్ని మీరు ఖండించారు. మీతో కలిసిపనిచేయడంఅసంభవం", అని రంగయ్య అన్నారు.

స్వాతంత్ర్య సంపాదనకుమార్గం

కమ్యూనిస్టులు అంతర్జాతీయ - జాతీయ పరిస్థితుల్ని సులభంగా అర్థమయేలా తెలియజెప్పారు. ఈ యుద్ధంలో మనం ప్రపంచ ప్రజల పక్షంచేరి, దేశరక్షణకై సర్వప్రయత్నాలు చేస్తేనే సామ్రాజ్యవాదం బలహీనమౌతుందనీ, మన దేశస్వాతంత్ర్యం దగ్గరపడుతుందనీ, ఉదాహరణపూర్వకంగా చెప్పారు. కాంగ్రెసు ఆదర్శాన్నే ఆచరణలో పెట్టమని హెచ్చరించారు. "పోరాట" కార్యక్రమం సరికాదని ఆగస్టు ఘటనల తరవాతనైనా, అనుభవంమీద, తెలుసుకోవద్దా? అని విజ్ఞప్తి చేశారు. ఆహార సమస్యను పరిష్కరించడంలో కమ్యూనిస్టులిచ్చే కార్యక్రమం ఎలా తప్పోచూపించమని అడిగారు. రంగయ్య ఓపికతో, చెప్పినదంతా విన్నారు.

"మీ పట్టువల్ల, మీ ఉత్సాహం, మీదేశభక్తి, నన్నుఆకర్షించుతున్నాయి. మీకూ-నాకూ కొన్నివిషయాలలో విభేదాలుఉన్నమాట నిజం. కాని, మనం కలసి పనిచేయడానికవి అడ్డురావు. సభ ఎన్ని గంటలకు?" అని ప్రశ్నించారు. సభ నిర్వాహకులు టైము తెలియజేశారు. సభకు అధ్యక్షత వహించడానికి రంగయ్య తనఅంగీకారాన్ని తెలియజేశారు. ఎవరి స్థానాలకు వారు వెళ్ళిపోయారు.

విచ్ఛిన్నకుల దుష్టప్రచారం

విచ్ఛిన్నకులు తమ ప్రయత్నాలను సాగిస్తూనే ఉన్నారు. కొంతమంది రంగయ్య వద్దకువెళ్ళి, ఆయనను తమవైపుకు తిప్పుకోవాలని చూచారు. కాని, విఫలులయారు. కొందరు పొరుగూళ్ళనుంచి వచ్చే రైతుల మధ్యకువెళ్ళి, సభ అసలు జరుగదనీ, పోలీసులు లాఠీఛార్జీ చేస్తారనీ, భయపెట్టజూచారు. మరికొందరితో, యిది గవర్నమెంటు సభ అనీ, యుద్ధబాండుల వసూళ్ళకు యిది జరుగుతూందనీ, ఎవరూ వెళ్ళవద్దనీ, ప్రచారం ప్రారంభించారు. రైతులు యీ పరస్పర విరుద్ధమైన కబుర్లువిని, అసలుసంగతి గ్రహించారు. విచ్ఛిన్నకుల దుష్టప్రచారానికి తగిన విధంగా రైతులే జవాబుచెప్పారు. క్రమక్రమంగా మహాసభకు వచ్చేవారిసంఖ్య ఎక్కువౌతూంది.

విద్రోహులు యిక ఆఖరుప్రయత్నంకూడా చేయాలని నిశ్చయించుకున్నారు. సభలో ప్రశ్నలవర్షం కురిపించి, గల్లంతుచేయాలని ప్లాను వేసుకున్నారు.

సభ కిటకిటలాడుతోంది. అన్ని గ్రామాల నుంచి రైతులు, కూలీలు వచ్చి కూర్చున్నారు. వాలంటీర్లు వచ్చినవారిని సర్ది కూర్చోపెడుతున్నారు. రంగయ్య సభావేదికవైపు వస్తున్నారు. తెల్లనిఖద్దరుబట్టలు, తలమీద గాంధీ టోపీ, చేతిలో ఏదో పుస్తకం ఉన్నాయి. అతడు సభావేదిక యెక్కగానే, రంగయ్య ఈ సభను వ్యతిరేకించబోతున్నాడని విన్న రైతులు ఆశ్చర్యపోయారు! "ఎగురవేయ్ భారతభువిపై...." అనే గీతంతో సభ ప్రారంభమయింది. రంగయ్య తన అధ్యక్షోపన్యాసం ప్రారంభించారు. అందరూ నిశ్శబ్దంగా విన్నారు. "ఈనాటి క్లిష్ట పరిస్థితులలో ప్రజల్నీ - దేశాన్నీ రక్షించడానికి, ఆహార సమస్యను పరిష్కరించడానికి, అన్ని రాజకీయపార్టీలు కలిసి పనిచేయకపోతే, మన జాతీయ సాంప్రదాయాలన్నీ మట్టిపాలౌతాయి. కనుకనే నేను దేశభక్తులతో చేయికలిపి, నా కర్తవ్యాన్ని నెరవేర్చపూనుకున్నాను." అని ఉపన్యాసాన్ని ముగించారు.

తగినశాస్తి జరిగింది

సభ అంతా కరతాళ ధ్వనులతో నిండింది. తరువాత, తాలూకా రైతుసంఘాధ్యక్షుడు ఉపన్యసిస్తూంటే, ఒక వ్యక్తిలేచి, "మీవంటి దేశద్రోహులతో మేము కలియం, కలియలేదు!" అని అరిచాడు. వెంటనే ప్రేక్షకులు, "వీడెవడురా పానకంలో పుడకలాగు? గెంటండి బయటికి", అన్నారు. ఆవేశంతో వారు లేవబోతూంటే వాలంటీర్లు సర్ది కూచోబెట్టారు. "ప్రశ్నలుంటే ఆఖరున వేయండి. లేదా వేదికమీదికి వచ్చి మాట్లాడండి." అని అధ్యక్షుడు హెచ్చరించారు. విచ్ఛిన్నకాదుడు: "ఇది ప్రజాయుద్ధంకాదని మీరంగీకరించితే, వచ్చి మాట్లాడుతాన"న్నాడు. రంగయ్య ఇలా జవాబిచ్చారు: "ప్రపంచ ప్రజలందరూ యుద్ధంలో ఉన్నప్పుడు ఇది ప్రజాయుద్ధం కాదని నేనెలా అంటాను? పైగా, ఇదిప్రజాయుద్ధమా, కాదా 'అని చర్చించడానికి కాదు, సభ." ప్రజలు గొల్లుమని నవ్వారు. విద్రోహులు నలుగురూలేచి నిలబడి, "అయితే యీసభను మేము బహిష్కరిస్తున్నాం." అంటూ వెనక్కు బయల్దేరారు. "ఇక్కడ చేరిన వేలమంది ప్రజల్నీ బహిష్కరించారురా, ధీరులు!" అని ఒకరు; "ఇంతెందుకూ? ప్రజలతో నిండి ఉన్న ప్రపంచాన్నే బహిష్కరించరాదా?" అని మరొకరు—ఇలా అందుకున్నారు ఒకరి తరవాత మరొకరు. పాపం, విచ్ఛిన్న కారులు తలమీద గుడ్డవేసుకొని, సభను"బహిష్కరిస్తూ" వెళ్లిపోయారు!

సభ పూర్తి అయేసరికి రాత్రి 12 గంటలు దాటింది. ఆఫిర్కా రైతులకు సంబంధించిన అనేకసమస్యలపై తీర్మానాలుగావించబడ్డాయి. వాటిని ప్రభుత్వానికి తెలియజేయుటకై ఒక సంఘాన్ని ఎన్నుకున్నారు. దానికిఅధ్యక్షులు రంగయ్యగారు. సభ పూర్తిఅయేవరకు వచ్చినజనం కదలలేదు. పై నలుగురూ తప్ప!

"రంగయ్యలో చాలా మార్పు వచ్చింది. ఎలాగయినా, నిజమైనదేశభక్తులు పరిస్థితుల్ని అర్థం చేసుకోక మానరు." అనుకుంటూ ఉల్లాసంగా కమ్యూనిస్టులు తమ యిళ్ళకు చేరుకున్నారు.

(1 వ పేజీ తరువాయి) ఆదేవిధంగా ఆంధ్ర రైతువుద్యమం భారత రైతు వుద్యమంలో భాగం. ఆవిధంగానే మనం ఆంధ్ర రైతుఉద్యమాన్ని సాగించాలి.

దేశభక్తులను ఈనాడు ప్రధానమైన సమస్యలు చాలా ఎదుర్కొన్నాయి. అందరం కలిసి, జాతీయనాయకుల విడుదలకై కృషి జేయనక్కరలేదా? దేశమంతటా వ్యాపిస్తున్న కరువును పారద్రోలుటకై కృషిజేయవద్దా? అందులకై పంటల నెక్కువ పండించవద్దా? పండినపంటలు కరువుతో కూలిపోయే ప్రజలకు కంట్రోలుద్వారా అందజేయుటకు ఏర్పాట్లను గావించవద్దా? ఎరువులు, ఇనుము, గుడ్డలు, మందులు వగైరా అవసరవస్తువులు కంట్రోలుధరలకు ప్రజలకుఅందునట్లు చూడవద్దా? యుద్ధబాండ్లను రైతులు శక్తిసామర్థ్యాలనుబట్టి కొంటూ, అధికారుల నిర్బంధాలకు గురికాకుండునట్లు చూడవద్దా? జపాను ప్రమాదంవున్న ఈ రోజుల్లో మాతృదేశాన్ని రక్షించుటకు ప్రజలను తయారుచేయవద్దా? ఈ సమస్య లన్నిటినీ పోటీసంఘాలను పెట్టడంద్వారా పరిష్కరించగలరా?

కాబట్టి రైతుఉద్యమ శ్రేయోభిలాషు లందరికీ ఒక మనవి. ఏవిధంగా 7 సంవత్సరాల నుండీ అఖిలభారత రైతుసంఘానికి అనుబంధంగా పనిజేస్తున్నామో, ఏవిధంగా ఇతర రాష్ట్రాల రైతుఉద్యమాలతో ఆంధ్ర రైతువుద్యమాన్ని పెనవేసి నడుపుతున్నామో, ఆ విధంగానే ఇకముందున్నూ నడుపుదాం. పోటీసంఘాలను పెట్టే రంగాముఠావలలో పడవద్దు. ఐక్యతతో రైతువుద్యమాన్ని నడుపుటకై ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం మిమ్మలను ఆహ్వానిస్తోంది.

ప్రజాశక్తి చందావివరాలు

★

సంవత్సర చందా	5—0—0
అర్థ సంవత్సర చందా	2—8—0
పావు సంవత్సర చందా	1—4—0

Printed and Published by Katragadda Rajagopala Rao at Prajasakti Press, Governorpet - Bezwada.

*

END OF ISSUE